

# నేటి నిజం


తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com








హైదరాబాద్ బుధవారం 16-12-2020 RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-2020 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :27 సంచిక:115 పేజీలు:4 వెల: రూ.1/-


# దేశానికే ఆదర్శంగా రైతు వేదికల నిర్మాణం



జగిత్యాల,డిసెంబర్15 : కరువు ప్రాంతాల్లో కాళేశ్వరం నీళ్లు పారుతుంటే ప్రతిపక్ష నాయకుల కండ్లలో కన్నీళ్లు కారుతున్నాయని సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు.

కొడిమ్యాల మండలం తిర్మలాపూర్‌లో రైతువేదికను మంత్రి కొప్పుల చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..ఐదు వేల ఎకరాల క్లస్టర్ ఆధారంగా 20 లక్షల రూపాయలతో రైతు వేదికల నిర్మాణం చేపట్టామన్నారు. సుమారు 300మందితో సమావేశం ఏర్పాటు చేసుకోవచ్చన్నారు.

రైతు వేదికలో ఒక హాల్,ఒక కంప్యూటర్ గది, అధికారులు కూర్చోడానికి ఒక గది ఉంటుదన్నారు. అలాగే రైతుల సౌలభ్యం కోసం కల్లాల ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. రైతును రాజుగా చూడాలనేది ముఖ్యమంత్రి కేసీఆర్ లక్ష్యం అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ లక్ష్యానికి అనుగుణంగా అధికారులు, ప్రజాప్రతినిధులు పని చేయాలని సూచించారు.

రైతు కల్లాల గురించి రైతులకు పూర్తి అవగాహన కల్పించాలన్నారు. కేసీఆర్ సీఎం అయ్యాకే కాళేశ్వరం నీళ్లతో చొప్పదండి నియోజకవర్గంలో కరువు పారిపోయిందన్నారు. రైతులకు 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్తును అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అన్నారు.

# రైతుల సమస్యను త్వరగా పరిష్కరించాలి

## లేకుంటే ఆర్థికంగా మరింత దెబ్బతింటాం

## రైతులను, కేంద్రాన్ని కోరిన అసోచామ్

న్యూఢిల్లీ,డిసెంబర్15(ఆర్‌ఎన్‌ఎ): కరోనా పరిస్థితుల నుంచి ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న దేశ ఆర్థిక వ్యవస్థపై రైతుల ఆందోళన తీవ్ర ప్రభావం చూపే ప్రమాదముందని వాణిజ్య సంఘాలు హెచ్చరిస్తున్నాయి. అన్నదాతల ఆందోళనల వల్ల సరఫరా దెబ్బతినడంతో ఇప్పటికే రోజుకు దాదాపు రూ. 3,500కోట్ల నష్టం వాటిల్లుతోందని అసోచామ్ తెలిపింది. ఇకనైనా సమస్యను త్వరగా పరిష్కరించుకోవాలని అటు కేంద్ర ప్రభుత్వాన్ని, ఇటు రైతులను అభ్యర్థించింది. ఈ మేరకు అసోచామ్ ఓ ప్రకటన విడుదల చేసింది. తాజాగా జరుగుతున్న ఆందోళనలు పంజాబ్, హరియాణా, హిమాచల్‌ప్రదేశ్, జమ్ముకశ్మీర్ ఆర్థిక వ్యవస్థలపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఈ రాష్ట్రాల ఆర్థిక వ్యవస్థ మొత్తం దాదాపు రూ. 18లక్షల కోట్లుగా ఉంటుంది. ప్రధానంగా వ్యవసాయం, ఉద్యానవనం, ఫుడ్‌ప్రాసెసింగ్, జౌళి, ఆటోమొబైల్‌పైనే వీటి ఆదాయం ఆధారపడి ఉంది. అయితే రైతుల ఆందోళన, రహదారుల నిర్బంధంతో ఈ రాష్ట్రాల్లో ఆర్థిక కార్యకలాపాలు నిలిచిపోయాయి. ఆటో విభాగాలు, సైకిళ్లు, క్రీడా ఉత్పత్తులు, టెక్స్‌టైల్ ముడిసరుకుల పరిశ్రమలు తమ ఉత్పత్తులను ఎగుమతి చేయలేకపోతన్నాయి. ఫలితంగా రోజుకు రూ. 3000–3,500 కోట్ల నష్టం వాటిల్లుతోంది' అని అసోచామ్ తన ప్రకటనలో పేర్కొంది. ఇక పంజాబ్, హరియాణా, హిమాచల్ ప్రదేశ్‌ల నుంచి పండ్లు, కూరగాయల సరఫరా నిలిచిపోవడంతో దేశవ్యాప్తంగా చాలా ప్రాంతాల్లో వీటి ధరలు ఆకాశన్నంటుతున్నాయని అసోచామ్ తెలిపింది. కొవిడ్ బారి నుంచి దేశ ఆర్థిక వ్యవస్థ ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న సమయంలో రైతులు ఆందోళన చేపట్టడం ప్రతికూల పరిణామమని అభిప్రాయపడింది. ఇప్పటికైనా రైతులు, కేంద్ర ప్రభుత్వం చర్చించుకుని సమస్యను పరిష్కరించుకోవాలని అసోచామ్ కోరింది.

అటు కాన్ఫడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ(సీఐఐ) కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. ఆందోళన ఇలాగే కొనసాగితే ఆయా రాష్ట్రాల ఆదాయం భారీగా దెబ్బతింటుందని, దేశ ఆర్థికవ్యవస్థపై కూడా తీవ్ర ప్రభావం చూపుతుందని సీఐఐ హెచ్చరించింది. త్వరితగతిన సమస్య పరిష్కారమయ్యేలా చూడాలని కోరింది.

# ప్రజల ఉద్యమంగా గ్రీన్ బిల్డింగ్స్ ఉద్యమం : ఎం. వెంకయ్యనాయుడు

హైదరాబాద్, డిసెంబర్15: గ్రీన్ బిల్డింగ్స్ ఉద్యమం ప్రజల ఉద్యమంగా మారాలని ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు పిలుపునిచ్చారు. హైదరాబాద్ వేదికగా గ్రీన్ రేటింగ్ ఫర్ ఇంటిగ్రేటెడ్ హ్యాబిటేట్ అసెస్‌మెంట్(గ్రిహ) సమ్మిట్ వర్చువల్ సమావేశాన్ని వెంకయ్య నాయుడు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉప రాష్ట్రపతి మాట్లాడుతూ.. పన్ను ప్రోత్సాహకాల ద్వారా హరిత భవనాలను ప్రోత్సహించాలని ఫైనాన్స్ కమిషన్లను, స్థానిక సంస్థలకు విజ్ఞప్తి చేశారు. గ్రీన్ బిల్డింగ్స్‌పై ప్రజలకు అవగాహన లోపించిందన్నారు. హరిత గృహాల గురించి అవగాహన కల్పించేందుకు మాస్ మీడియా విస్తృత ప్రచారం చేయాలన్నారు. అదేవిధంగా సింగిల్ విండో విధానంలో గ్రీన్ బిల్డింగ్స్ క్లియరెన్స్‌కు ఆన్‌లైన్ పోర్టల్‌ను ఏర్పాటు చేయాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వాలను ఆయన కోరారు.

2050 నాటికి దేశంలోని సగం జనాభా నగరాలు, పట్టణాల్లో నివసించనున్నట్లు తెలిపారు. మెటల్, ఆస్‌బెస్టాస్, కాంక్రీట్ వంటి వస్తువులను 60 శాతానికి పైగా ఇంటి నిర్మాణంలో వాడుతున్నట్లు అందుకే పరిసరాల ఉష్ణోగ్రతలు హెచ్చుగా ఉంటాయన్నారు. పర్యావరణహిత కూల్ రూఫ్స్‌తో ఇండోర్ ఉష్ణోగ్రతలను 2 నుంచి 4 డిగ్రీల వరకు తగ్గించ వచ్చన్నారు. కొన్ని సాధారణ టెక్నిక్‌లను ఉపయోగించి లైమ్ బేస్డ్ పెయింట్, రిఫ్లెక్టివ్ కోటింగ్స్ వంటి చర్యలను చేపడుతూ ఉష్ణాన్ని తగ్గించొచ్చన్నారు. సహజ సిద్ధంగా లభించే గాలి, వెలుతురును ఉపయోగించుకుంటూ పర్యావరణహిత నిర్మాణాలను చేపట్టాలని ఉప రాష్ట్రపతి పేర్కొన్నారు.

# నయీం కేసులో సమగ్ర విచారణ జరపాలి

## గవర్నర్‌కు ఫోరమ్ ఫర్ గుడ్ గవర్నెన్స్ లేఖ

హైదరాబాద్,డిసెంబర్15(ఆర్‌ఎన్‌ఎ): గ్యాంగ్‌స్టర్ నయీం కేసులో సమగ్ర సత్వర విచారణకు ఆదేశించాలని గవర్నర్ తమిళిసైకు ఫోరమ్ ఫర్ గుడ్ గవర్నెన్స్ లేఖ రాసింది. నయీం ఎన్ కౌంటర్ తర్వాత అతని నివాసాల్లో జరిగిన తనిఖీల్లో పదుల సంఖ్యలో ఆయుధాలు, పెద్ద మొత్తంలో మందుగుండు, పేలుడు పదార్థాలు లభించాయని, వాటిని సమకూర్చుకోవడంలో పోలీస్ అధికారులు అతనికి సహకరించి ఉంటారని ఎఫ్‌జీజీ కార్యదర్శి పద్మనాభరెడ్డి గవర్నర్‌కు రాసిన లేఖలో పేర్కొన్నారు. ఏకె47వంటి ఆయుధాలను సమకూర్చుకున్న నయీంకు ఉగ్రవాదులతో సంబంధాలు ఉండే అవకాశాలు ఉంటాయని ఆందోళన వ్యక్తం చేశారు. నయీంతో అంటకాగిన పోలీస్, రాజకీయ నాయకులు, రెవెన్యూ, రిజిస్ట్రేషన్ అధికారులపై సమగ్ర విచారణ జరిపి వారందరిపై చర్యలు తీసుకునేలా ఆదేశించాలని గవర్నర్‌ను కోరారు. నయీం ఎన్‌కౌంటర్ తర్వాత లభించిన ఆయుధాలు, నగదు, పత్రాలకు సంబంధించి ప్రత్యేక దర్యాప్తు బృందం అధికారిగా ఉన్న ఐజీ నుంచి సేకరించిన వివరాలను ఆ లేఖలో గవర్నర్‌కు వివరించారు. ఐజీ సమర్పించిన సిట్ నివేదికను లేఖకు జత చేశారు.

# దేశంలోనే తెలంగాణ జైళ్ల శాఖకు ప్రత్యేక గుర్తింపు



మేడ్చల్ మల్కాజిగిరి,,డిసెంబర్15 : దేశంలోనే తెలంగాణ జైళ్ల శాఖ ప్రత్యేక గుర్తింపు సాధించి అగ్రగామిగా నిలిచిందని హోం శాఖ మంత్రి మహమూద్ అలీ పేర్కొన్నారు.

ఏఎస్‌రావునగర్ డివిజన్ పరిధిలోని కమలానగర్‌లో జైళ్ల శాఖ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన మైనేషన్ పెట్రోల్ బంక్‌ను జైళ్ల శాఖ డీజీ రాజీవ్‌త్రివేది, మేయర్ బొంతు రామ్మోహన్, ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, ఎమ్మెల్సీ కాటెపల్లి జనార్దన్‌రెడ్డిలతో కలిసి ఆయన ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ జైళ్ల శాఖ ఆదాయ వనరులపై దృష్టి సారించి లాభాలను అర్జించడం హర్షనీయమన్నారు. కేంద్ర కారాగారంలో శిక్ష అనుభవిస్తున్న ఖైదీల సంక్షేమానికి కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ముఖ్యంగా వారికి సౌకార్యలు కల్పించడంతో పాటు ఉపాధి రంగాలలో శిక్షణ ఇస్తున్నామని ఆయన తెలిపారు. అదేవిధంగా తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పలు జైలులో శిక్ష అనుభవిస్తున్న ఖైదీలకు దేశంలో ఎక్కడ లేని విధంగా చదువుకునే వీలు కల్పించి వారిని సక్రమ మార్గంలో పయనించే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

తెలంగాణ రాష్ట్రం ఏర్పాడిన అనంతరం జైళ్ల శాఖకు సీఎం కేసీఆర్ అధిక ప్రాధన్యత ఇచ్చారని ఆయన గుర్తు చేశారు. ఖైదీలు, జైళ్ల శాఖ సిబ్బంది సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించి ముందుకు సాగుతున్నామన్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా జైలులో శిక్ష అనుభవిస్తున్న ఖైదీలకు ఆయా రంగాల్లో శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పిస్తున్నామని, ముఖ్యంగా జైలులో పరిశ్రమలను స్థాపించి ఆయా రంగాల్లో రాణించే విధంగా శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పిస్తున్నామన్నారు. శిక్ష అనుభవిస్తున్న ఖైదీలు విడుదల అనంతరం వివిధ రంగాలలో ఉపాధి పొందే విధంగా చర్యలు తీసుకుంటున్నామని, జైలులో తీసుకున్న శిక్షణలతో విడుదల అనంతరం ఖైదీలు ఉపాధి పొంది స్థిరపడాలని ఆయన సూచించారు.

# నిరుద్యోగ ప్రకటన మరో మోసం

## ఆరేళ్లుగా లేని ప్రేమ అమాంతం పుట్టుకొచ్చింది

## చిత్తశుద్ధి ఉంటే వెంటనే నోటిఫికేషన్ ఇవ్వాలి: కోదండరామ్

హైదరాబాద్,డిసెంబర్15(ఆర్‌ఎన్‌ఎ): ఉద్యోగాల పేరుతో తెరాస ప్రభుత్వం నాటకాలాడుతోందని తెలంగాణ జన సమితి పార్టీ అధ్యక్షుడు కోదండరాం విమర్శించారు. ఇప్పటికే ఆరేళ్లుగా నిరుద్యోగులను వంచించిన సర్కార్ మరోమారు నిరుద్యోగులను మోసం చేయాలని చూస్తోందని అన్నారు.

నాంపల్లిలోని పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణలో ప్రస్తుతం 34 శాతం మంది నిరుద్యోగులు ఉన్నారని వివరించారు. ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీ జరుగుతుందనే నమ్మకం తమ పార్టీకి లేదని కోదండరాం స్పష్టం చేశారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఈ నెలఖారులోపే ఖాళీ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్లు ఇవ్వాలని, మార్చి లోపు పరీక్షలు నిర్వహించి భర్తీ చేయాలని కోదండరాం డిమాండ్ చేశారు. దుబ్బాక, జీహెచ్ఎంసీ ఎన్నికల ఫలితాల్లో చేదు అనుభవం ఎదురవడంతోనే తెరాస ప్రభుత్వం ఉద్యోగాల ప్రకటన చేసిందని వ్యాఖ్యానించారు. ఇప్పటికే కొత్త పీఆర్సీ రావాల్సి ఉండగా ఇంకా.. పాతది కూడా అందలేదన్నారు. ప్రభుత్వానికి ఆంధ్రా గుత్తేదారుల జేబులు నింపడంపై ఉన్న శ్రద్ధ నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించడంపై లేదని విమర్శించారు. ఉపాధ్యాయులకు ఆరేళ్లుగా పదోన్నతులు ఇవ్వడంలేదని గుర్తు చేశారు. స్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కార్పొరేషన్ రుణాల బకాయిలు ఉన్నాయని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం వద్ద ఖాళీ పోస్టుల సమాచారం ఉన్నప్పటికీ కమిటీల పేరుతో కాలయాపన చేస్తోందని ఆరోపించారు. ఇటీవల దిల్లీ వెళ్లిన సీఎం కేసీఆర్ జోనల్ వ్యవస్థ మీద స్పష్టత తీసుకుని రాలేదన్నారు. పాత జోనల్ విధానం ప్రకారం ఖాళీలు భర్తీ చేస్తే అనేక సమస్యలు తలెత్తుతాయని పేర్కొన్నారు.

# రిపబ్లిక్ వేడుకలకు అతిథిగా బ్రిటన్ ప్రధాని

## బోరిస్ జాన్సన్ రాకను ధృవీకరించిన లండన్

న్యూఢిల్లీ,డిసెంబర్15(ఆర్‌ఎన్‌ఎ): 2021 గణతంత్ర దినోత్సవ వేడుకలకు బ్రిటన్ ప్రధాని బోరిస్ జాన్సన్ హాజరుకానున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ఆహ్వానాన్ని బోరిస్ జాన్సన్ అంగీకరించారు. ప్రధాని మోదీ ఆహ్వానాన్ని అంగీకరించినట్లు బ్రిటన్ విదేశాంగ శాఖ మంత్రి తెలిపారు. బ్రిటన్ విదేశాంగ శాఖ మంత్రి ప్రస్తుతం భారత పర్యటనలో ఉన్నారు. 2021 రిపబ్లిక్ వేడుకలకు హాజరు కావాలని నవంబర్ 27వ తేదీన బోరిస్ జాన్సన్‌కు మోదీ ఫోన్ చేసి ఆహ్వానించిన విషయం తెలిసిందే. వచ్చే ఏడాది నిర్వహించే జీ7 సదస్సులో పాల్గొనాలని మోదీని కూడా జాన్సన్ ఆహ్వానించారు. 27 ఏళ్ల తర్వాత రిపబ్లిక్ వేడుకల్లో పాల్గొంటున్న బ్రిటన్ ప్రధాని బోరిస్ జాన్సన్ కావడం విశేషం. చివరి సారిగా 1993లో జాన్ మేజర్ గణతంత్ర దినోత్సవ వేడుకలకు హాజరయ్యారు.

# పార్లమెంట్ శీతాకాల సమావేశాలు రద్దు

న్యూఢిల్లీ,డిసెంబర్15(ఆర్‌ఎన్‌ఎ): ఈ ఏడాది శీతాకాల పార్లమెంట్ సమావేశాలు నిర్వహించడం లేదు. నోవెల్ కరోనా వైరస్ కేసులు ప్రబలుతున్న నేపథ్యంలో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. శీతాకాల పార్లమెంట్ సమావేశాలను రద్దు చేసేందుకు అన్ని పార్టీలు అంగీకరించినట్లు పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి తెలిపారు. కోవిడ్ వ్యాప్తి అడ్డుకునేందుకు నేరుగా జనవరిలో బడ్జెట్ సమావేశాలను నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. సమావేశాలను నిర్వహించాలని కాంగ్రెస్ నేత అధిర్ రంజన్ చౌదరీ డిమాండ్ చేస్తూ లేఖ రాసిన నేపథ్యంలో.. మంత్రి ప్రహ్లాద్ జోషి దీనిపై క్లారిటీ ఇచ్చారు. అన్ని పార్టీల నేతలతో సంప్రదింపులు జరిపామని, సమావేశాలను రద్దు చేయాలని ఏకగ్రీవంగా అందరూ ఆమోదించినట్లు మంత్రి తెలిపారు.

# ఆస్తుల రిజిస్ట్రేషన్లపై కేబినెట్ సబ్‌కమిటీ భేటీ

హైదరాబాద్,డిసెంబర్15(ఆర్‌ఎన్‌ఎ): తెలంగాణలో వ్యవసాయేతర ఆస్తుల రిజిస్ట్రేషన్ అంశాలపై కేబినెట్ సబ్ కమిటీ భేటీ అయింది. మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి అధ్యక్షతన జరుగుతున్న ఈ సమావేశానికి మంత్రులు మహమూద్ అలీ, కేటీఆర్, ఎర్రబెల్లి దయాకర్ రావు, తలసాని శ్రీనివాస్ యాదవ్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్ హాజరయ్యారు. రిజిస్ట్రేషన్లకు సంబంధించిన అంశాలు, సమస్యలపై చర్చిస్తున్నారు. అన్ని వర్గాలతో మాట్లాడి సూచనలు ఇవ్వాలని కేబినెట్ సబ్ కమిటీని సీఎం కేసీఆర్ ఆదేశించారు. బిల్డర్లు, స్థిరాస్తి వ్యాపారులు, ఇతర వర్గాల అభిప్రాయాలను మంత్రులు సేకరించనున్నారు. రిజిస్ట్రేషన్ల సమస్యలతో పాటు సలహాలు, సూచనలను ఉపసంఘం స్వీకరించనుంది.

# పారదర్శకంగా క్రయ విక్రయాలు : మంత్రి ప్రశాంత్ రెడ్డి

హైదరాబాద్, డిసెంబర్15: రాష్ట్రంలో వ్యవసాయేతర ఆస్తుల రిజిస్ట్రేషన్లపై చర్చించేందుకు సమావేశమైన కేబినెట్ సబ్ కమిటీ భేటీ ముగిసింది. మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మంత్రులు మహమూద్ అలీ, కేటీఆర్, ఎర్రబెల్లి దయాకర్‌రావు, తలసాని శ్రీనివాస్ యాదవ్‌తో పాటు సంబంధిత అధికారులు పాల్గొన్నారు. సమావేశం ముగిసిన అనంతరం మంత్రి ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ.. అత్యంత సులువైన రిజిస్ట్రేషన్ల ప్రక్రియ కోసం పలు అంశాలపై చర్చించామన్నారు. క్రయ విక్రయాలు పారదర్శకంగా జరగాలన్నదే సీఎం కేసీఆర్ అభిమతమని స్పష్టం చేశారు. రియల్ ఎస్టేట్‌కు ఎలాంటి ఆటంకాలు కలగరాదని సీఎం స్పష్టం చేశారని తెలిపారు. ప్రారంభ సమస్యలు ఉన్నా రిజిస్ట్రేషన్లు పుంజుకుంటున్నాయి. సమస్యలను అధిగమించి ప్రక్రియ సులువుగా జరిగేలా చేస్తామన్నారు. రద్దీ ఆధారంగా రిజిస్ట్రేషన్ల కార్యాలయాలను నాలుగు విభాగాలుగా చేశామన్నారు. రద్దీ ఉన్న కార్యాలయాలకు ఎక్కువ మంది రిజిస్ట్రార్లు, సిబ్బందిని నియమిస్తామని పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న రిజిస్ట్రేషన్లను వేగవంతంగా పూర్తి చేస్తామన్నారు. మార్చి వరకు ఎలాంటి పెండింగ్ కేసులు లేకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. రిజిస్ట్రేషన్లకు సంబంధించి అన్ని వర్గాల నుంచి సూచనలు, సలహాలు స్వీకరించాం.. వారం రోజుల్లో అన్ని సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారు. సమస్యలను అధిగమించేందుకు ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందన్నారు. రిజిస్ట్రేషన్లపై బ్యాంకులకు ఉన్న అపోహలను తొలగిస్తాం అని మంత్రి ప్రశాంత్ రెడ్డి స్పష్టం చేశారు.

# కప్పు టీతో వచ్చే మజాయే వేరు ..అంటున్న కవిత



హైదరాబాద్,డిసెంబర్15(ఆర్‌ఎన్‌ఎ): ఉదయం ఓ కప్పు టీ కడుపున పడితేనే రోజు ప్రారంభం అవుతుంది. సామాన్యుడి నుంచి ధనికుడిని సైతం ఉదయం లేవగానే ఓ కప్పు టీ నాలికను తాకాల్సిందే. అలా అందరినీ ఆహ్లాదపరిచే టీకి ఎంతో ప్రాముఖ్యత ఉంది. అలాంటి చాయ్‌కి గుర్తింపుగా డిసెంబర్ 15న అంతర్జాతీయ టీ దినోత్సవాన్ని ప్రపంచ దేశాలు జరుపకుంటున్నాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత టీ తాగుతున్న సెల్ఫీ ఫొటోను ట్విటర్‌లో షేర్ చేశారు. తీరిక లేకుండా పనితో అలసిపోయినప్పుడు మధ్యలో ఒక కప్పు వేడివేడి అల్లం టీ తాగితే వచ్చే మజాయే వేరు. ఈ సందర్భంగా అల్లం చాయ్ తాగుతున్న నా సెల్ఫీని మీతో పంచుకుంటున్న. అలాగే నా ఫాలోవర్స్ కూడా టీ తాగుతున్న మీ సెల్ఫీని నాతో పంచుకోండి' అంటూ కవిత ట్వీట్ చేశారు. కవిత పిలుపు మేరకు ఆమె ట్విటర్ ఫాలోవర్స్ అంతా టీ

తాగుతున్న సెల్ఫీ ఫొటోలను ఆమెతో షేర్ చేసుకుంటున్నారు. బిజీ షెడ్యూల్ మధ్యలో, కప్పు అల్లం ఛాయ్ తాగితే, మనస్సు ఎంతో ఆహ్లాదకరంగా ఉంటుందని కవిత ట్వీట్ చేశారు.

# జేఈఈ మెయిన్- 2021 షెడ్యూల్ విడుదల

న్యూఢిల్లీ , డిసెంబర్ 15: దేశ వ్యాప్తంగా ఉన్న ఐఐటీ, ఎన్ఐటీల్లో ప్రవేశాల కోసం నిర్వహించే జేఈఈ మెయిన్ పరీక్ష షెడ్యూల్ విడుదలైంది. ఈసారి నాలుగు విడుతల్లో జేఈఈ మెయిన్ నిర్వహించాలని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) నిర్ణయించింది. అర్హులైన విద్యార్థులు నేటి నుంచి 2021, జనవరి 15వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. ఫిబ్రవరి 22 నుంచి 25వ తేదీ వరకు, రోజుకు రెండు విడుతల్లో ఆన్‌లైన్‌లో జేఈఈ మెయిన్ మొదటి పరీక్ష నిర్వహించనున్నారు. మార్చి, ఏప్రిల్, మేలో మరో మూడు విడుతల్లో పరీక్షలు నిర్వహించనున్నారు. ఇతర వివరాల కోసం jeemain.nta.nic.in వెబ్‌సైట్‌ను సందర్శించొచ్చు.

# సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేత



కుమ్రం భీం ఆసిఫాబాద్, డిసెంబర్ 15: : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సీఎం సహాయ నిధి పథకం పేద ప్రజలకు ఎంతో ఆసరాగా నిలుస్తుందని ఆసిఫాబాద్ శాసనసభ్యుడు ఆత్రం సక్కు అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..సీఎంఆర్‌ఎఫ్ నిరుపేదలు వరంగా మారిందన్నారు. ఆపదలో ఉన్న వారికి ఇది సంజీవనిలా పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## చరిత్రలో నేటినిజం



కం॥ తీరగు ముఖ కవళికలో
హీరోగా నిలచి ప్రజకు హితుడు కాగా
కేరళ ప్రేక్షకులు - ఆమకు
ప్రేరకుడని - గొలుతురు - మది "ప్రేమనజీరున్"!!

( డిసెంబర్ 16 ప్రేంనజీరు పుట్టిన రోజు... )

–రాధశ్రీ

సెల్: 9494481210



# రిజిస్ట్రేషన్లపై కొనసాగుతున్న ఆందోళన

హైదరాబాద్,డిసెంబర్15(ఆర్‌ఎన్‌ఎ): రాష్ట్రంలో పలుచోట్ల రిజిస్ట్రేషన్ల సమస్యలపై నిరసనలు కొనసాగుతున్నాయి. పాత పద్ధతిలోనే రిజిస్ట్రేషన్లు చేయాలంటూ ఉప్పల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ముందు డాక్యుమెంట్స్ అండ్ రైటర్స్ ఫెడరేషన్ ఆందోళనకు దిగింది. అటు కరీంనగర్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో నెమ్మదిగా రిజిస్ట్రేషన్ల పక్రియ కొనసాగుతోంది. సర్వర్లు మొరాయిస్తున్నాయి. దీంతో స్లాట్ బుకింగ్ జరగడంలేదు. ధరణి బుకింగ్‌లను రద్దు చేయాలని, అలాగే ఎల్ఆర్ఎస్ లేని ప్లాట్లని కూడా రిజిస్ట్రేషన్లు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

# కరోనా బారిన పడ్డ మంత్రి పువ్వాడ

## తెలంగాణలో తగ్గుముఖం పడుతున్న కేసులు

హైదరాబాద్,డిసెంబర్15(ఆర్‌ఎన్‌ఎ): తెలంగాణలో కరోనా ఉధృతి కొనసాగుతోంది. ఇప్పటికే 2.78 లక్షలకు పైగా కేసులు నమోదయ్యాయి. సాధారణ ప్రజలతో పాటుగా సెలెబ్రిటీలు, రాజకీయ నాయకులు కరోనా బారిన పడుతున్నారు. తాజాగా తెలంగాణ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ కరోనా బారిన పడ్డారు. న్న ఆయన ఆర్టిపీఆర్ టెస్టులు చేయించుకు న్నారు. ఈ టెస్టుల్లో ఆయనకు కరోనా పాజిటివ్ గా నిర్ధారణ జరిగింది. ఈ విషయాన్ని మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ట్విట్టర్ ద్వారా తెలిపారు. 'నాకు కరోనా అని తెలియగానే ప్రేమతో ఆందోళన చెందిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు. కొన్ని రోజుల నుంచి నన్ను కలిసిన ప్రతి ఒక్కరు కరోనా పరీక్షలు చేయించుకోవాలి. ఎవరూ కూడా ఆందోళన చెందాల్సిన ఆవాసం లేదు. హైదరాబాద్‌లోని మినిస్టర్స్ క్వార్టర్స్‌లో హోమ్ క్వారంటైన్‌లో ఉన్నాను. నాకు ఫోన్ చేయడానికి గాని, కలవడానికి గాని ప్రయత్నించకండి. నా హెల్త్ అప్డేట్స్ ఎప్పటికప్పుడు మీతో షేర్ చేసుకుంటాను. త్వరలోనే యధావిధిగా మీ మధ్యకు వచ్చి అన్ని కార్యక్రమాల్లో పాల్గొంటాను' అని మంత్రి పువ్వాడ పేర్కొన్నారు. ఇకపోతే కేసుల సంఖ్య గతంతో పోలిస్తే తగ్గుతూనే ఉంది. గతంలో రెండు వేలకు పైగా నమోదైన కేసులు ఇప్పుడు ఐదు వందల లోపే నమోదవుతున్నాయి. తాజాగా గడిచిన 24గంటల్లో రాష్ట్రంలో 491 కరోనా కేసులు నమోదయ్యాయని ఆరోగ్యశాఖ తెలిపింది. దీంతో తెలంగాణలో నమోదైన మొత్తం కరోనా కేసుల సంఖ్య 2,78,599కి చేరింది. తాజా గా.. 596 మంది కోలుకోగా.. ఇప్పటి వరకు 2,69,828 మంది డిశ్చార్జి అ య్యారు. కాగా, 7,272 కేసులు యాక్టివ్ కేసులున్నాయి. మరో 5,169 మంది హోం ఐసోలేషన్‌లో ఉన్నారు. వైరస్ ప్రభావంతో మరో ముగ్గురు మృతి చెందగా.. మొత్తం మృతుల సంఖ్య 1499కి చేరింది. ప్రస్తుతం రాష్ట్రంలో రికవరీ రేటు 96.85శాతంగా ఉందని, మరణాల రేటు 0.53శాతంగా ఉందని ఆరోగ్యశాఖ తెలిపింది. సోమవా రం రాష్ట్రవ్యాప్తంగా ఒకే రోజు 48,005 రక్త నమూనాలను పరిశీలించినట్లు తెలి పింది. ఇప్పటి వరకు 62,05,688 శాంపి ల్స్ పరిశీలించినట్లు ఆరోగ్యశాఖ వివరించింది.

# రైతు ఉద్యమంతో బలపడుతున్న మోడీ వ్యతిరేకులు

నేటినిజం
బుధవారం 16-12-2020

పౌరసత్వ చట్ట సవరన తరవాత ఇప్పుడు వ్యవసాయ చట్టాలు విపక్షాలకు అందివచ్చాయి. ముఖ్యంగా పంజాబ్ సిఎం అమరీందర్ సింగ్ రైతులను పరోక్షంగా ప్రోత్సహించడంతో పంజాబ్ రైతులు ఢిల్లీ శివారులో తిష్టవేశారు. వారంతా ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై మాట్లాడుతున్నారు. వ్యవసాయ చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. మార్పులు,చేర్పులకు కూడా ముందుకు రావడం లేదు. దీంతో ప్రధాని నరేంద్ర మోడీకి వ్యతిరేకంగా దాదాపుగా అన్ని పార్టీలూ ఏకం అవుతున్నాయి. టిఆర్ఎస్ అధినేత కెసిఆర్ రైతులకు మద్దతు ప్రకటించినా ఢిల్లీలో మాత్రం వారిని కలవలేదు. ఆయన సమయం కోసం వేచి చూస్తున్నారు. పదేళ్ల కాంగ్రెస్ పాలనతో విసిగెత్తిన ప్రజలు ఇప్పుడు మోడీ పాలనతోనే విసుగెత్తు తున్నారన్న ప్రచారం చేపట్టారు. మోడీ పాలనకన్నా కాంగ్రెసే నయం అన్న భావనలో రైతులు ఉన్నారన్న ప్రచారాన్ని ఉధృతం చేయడమే ఈ రైతు ఉద్యమం వెనక లక్ష్యంగా కనిపిస్తోంది. గతమే బెటర్ అన్న ధోరణి ప్రజల్లో బలంగా నాటుకునేలా వివిధ రాష్ట్రాల్లో ఉన్న ప్రాంతీయ పార్టీల నేతలు ఏకం అవుతున్నారు. అలాగని గతంలో కాంగ్రెస్ మంచి చేసిందన్న భావన కాదు. బిజెపి తను చేసిన ఘనకార్యాలను చాటే బదులు కాంగ్రెస్‌ను విమర్శిస్తూ కుటిల రాజకీయాలను వంట బట్టించుకుందని రాహుల్ పదేపదే విమర్శలు చేస్తున్నారు. అధికారంతో కూడిన అహంకారం తలకెక్కినవారికి వాస్తవాలు కనిపించవనడానికి దేశ సమస్యల పరిష్కారంలో వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడమే నిదర్శనం. గతంలో కాంగ్రెస్ ఇలాగే వ్యవహరించింది. ఎపికి ప్రత్యేక హోదా బదులు ప్యాకేజీ ఇస్తామని చెప్పినా దానిని అమలు చేయలేక పోవడంతో ఎపిలో ప్రజలు బిజెపి అంటేనే మండిపడుతున్నారు. ఈ ప్రభావం మొన్నటి జిహెచ్ఎంసి ఎన్నికల్లో హైదరాబాద్ సెటిలర్లు పరోక్షంగా చాటారు. ప్యాకేజీ అమలు కాకపోవడంతో పరిస్థితులు తిరగ బడ్డాయి. ప్రత్యేక హోదా అంశం మళ్లీ తెర మిదకు వచ్చింది. ప్రజాభిప్రాయానికి అనుగుణంగా నడుచుకోని పార్టీలకు మనుగడ ఉండదని బిజెపి నేతలు భావించడం లేదు. తమకు భారతీయ జనతా పార్టీ అన్యాయం చేస్తున్నదని ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ ప్రజలు బలంగా నమ్ముతున్నారు. అమరావతి విషయంలో స్పష్టత ఇవ్వకపోవడం కారణంగా చూడాలి. దీనికంతటికీ కారణం నరేంద్ర మోదీ పాలనాతీరే నిదర్శనంగా చూస్తున్నారు. ఇకపోతే దేశంలో ఆర్థిక పరస్థితులు నానాటికి దిగజారుతున్నాయి. ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. అందుకే రైతుల ఆందోళనలతో కాంగ్రెస్‌లో ఉత్సాహం రెట్టింపయ్యింది. ప్రాంతీయ పార్టీల నాయకులే కాకుండా కాంగ్రెస్ పార్టీ కూడా చేయి కలిపింది. ఎవరికి వారుగా చెల్లాచెదురుగా ఉన్న ప్రతిపక్షా లను ఏకం కావడం అన్నది ప్రజల్లో ఉన్న వ్యతిరేకతను ప్రచారం చేయడానికి పనికివస్తోంది. అందుకే దేశ ప్రజానీకంలో విద్వేషాలు రగిల్చేందుకు బిజెపి యత్నిస్తోందని, మోడీ ప్రభుత్వం పట్ల ప్రస్తుతం దేశమంతా అసంతప్తి, ఆగ్రహం వ్యక్తం చేస్తోందని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ పదేపదే విమర్శలకు పదను పెడుతున్నారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకహోదా ఇవ్వాల్సిందేనని, దానితో పాటు విభజన సమయంలో ఇచ్చిన హామీలు అన్నీ అమలు చేయాలని ఎపిలో కూడా గళం ఎత్తుతున్నారు. ప్రజల మధ్య విద్వేషాలను రెచ్చగొడుతూ బిజెపి దేశాన్ని అడ్డగోలుగా చీల్చేస్తోందని ప్రాంతీయ పార్టీల నేతలు ధ్వజమెత్తుతున్నారు. ప్రస్తుతం దేశమంతా అసంతప్తి, ఆగ్రహంతో ఉంది. ఈ పరిస్థితుల్లో దేశం మొత్తాన్ని ఏకం చేయాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని చెప్పడం ద్వారా తెలంగాణ సిఎం కెసిఆర్ బిజెపిపై యుద్ధం ప్రకటించారు.

అన్ని పార్టీలను కలుపుకొని ముందుకు తీసుకువెళతానని చెప్పడం ద్వారా పార్టీ శ్రేణుల్లో భరోసా కల్పించారు. అన్ని వర్గాల ప్రజల అభివద్ధి, ప్రయోజనాల కోసమే తమ ఫ్రంట్ పనిచేస్తోందని హామీ ఇచ్చారు. మన్మోహన్ సింగ్ ప్రభుత్వ హయాంలో ఆర్థికవృద్ధి తిరోగమనంలో పడిందని ఎన్నికలకు ముందు విపరీత ప్రచారం చేశారు. దీనిని మోడీ బాగా ప్రచారం చేశారు. అయితే ఆయన పాలన అంతా ప్రచారంగా ఉందని తాజా పరిస్థితులు అద్దం పడుతున్నాయి. అందుకే వ్యవసాయం, యువత, మహిళలు, ఎస్సీ, ఎస్టీ, నిరుద్యోగం, పేదరిక నిర్మూలన, దేశ భద్రత, ఆర్థిక, పారిశ్రామిక విధానం, విదేశీ వ్యవహారాలు ప్రస్తావించ దం ద్వారా కెసిఆర్ జాతీయ రాజకీయాల ఆవశ్యకతను చాటారు. ఎందుకంటే బిజెపి పాలన ప్రజలకు భారంగా మారిందని, నోట్ల రద్దు, జిఎస్టీ,వ్యవసాయ చట్టాలు తదితర అంశాల కారణంగా ప్రజలపై కోలుకో లేని ఆర్థిక భారం పడుతోంది. ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. రైతులకు గిట్టుబాటు ధరలు రావడం లేదు. నిరుద్యోగం తాండవిస్తోంది. దీంతో పాటు అనేక సమస్యలు ప్రజలను వెన్నాడుతున్నాయి. ఈ దశలో ప్రజలకు మళ్లీ తృతీయప్రత్యామ్నాయం ఆశగా కనిపిస్తోంది. సిఎం కెసిఆర్ ఏర్పాటుచేసే ఫ్రంట్ ఏ రకంగా ఉంటుందున్న చర్చ సాగుతోంది. అలాగే కాంగ్రెస్ శ్రేణులకు కూడా భరోసా కనిపిస్తోంది. మోడీ వ్యతిరేకత తమను అధికారంలోకి తీసుకుని వస్తుందని భావిస్తున్నారు. మొత్తంగా మోడీ వ్యతిరేక కూటమి బలపడు తోంది. దేశంలో అన్ని ప్రాంతాల్లో తీవ్ర వ్యతిరేకత ఉన్న దృష్ట్యా పరిస్థితులు బిజెపికి వ్యతిరేకంగా కట్ట కట్టడానికి పనికి వస్తున్నాయి. ఇందులో భాగంగా రైతుల ఆందోళనలను వేదికగా చేసుకోవాలని ఆమ్ ఆద్మీ పార్టీ మొదలు మమతా బెనర్జీ, కెసిఆర్, స్టాలిన్, కాంగ్రెస్ సహా అన్ని పార్టీలు ముందుకు వస్తున్నాయి. అయితే ఈ ఐక్యత ఏ మేరకు పనిచేస్తుందన్నది చూడాలి. ఎంతవరకు అన్ని పార్టీలు కలసి వస్తాయన్నది ముఖ్యం. ముఖ్యంగా కాంగ్రెస్ సహా ప్రాంతీయ పార్టీల నేతలు అవినీతిలో కూరుకుని ఉన్నారు. వారు తమ అవినీతిపై ఎలా సమాధానం ఇస్తారో కూడా చూడాలి. ప్రజాస్వామ్యంలో ఎప్పుడు ఏదైనా సాధ్యమే. కలసి రావచ్చు..లేదా కూలబడి పోవచ్చు.. భవిష్యత్ ఎలా ఉంటుందన్నది ప్రజల నిర్ణయం మేరకు ఆధారపడి ఉంటుంది. ప్రజలకు అనుగుణంగా ఆయా పార్టీలు నడుచుకునే తీరును బట్టే బిజెపి వ్యతిరేక ప్రత్యామ్నాయం ఆధారపడి ఉంటుంది.

## డిఎస్సీ నియామకాలు చేపట్టాలి

వరంగల్,డిసెంబర్15(ఆర్ఎన్ఎ): ప్రభుత్వం డీఎస్సీ నోటిఫికేషన్‌ను విడుదల చేయడంలో జాప్యం చేయడం తగదని డిఎస్సీ కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో వెంటనే ఉపాధ్యాయ ఉద్యోగాలను భర్తీ చేయాలని తెలంగాణ బీఈడీ, డీఈడీ డీఎస్సీ అభ్యర్థుల సంఘం డిమాండ్ చేసింది. ప్రభుత్వం ప్రకటించిన మేరకు వెంటనే స్పందించి నియామకాల కోసం ప్రకటన విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ ఉద్యోగాలకు అర్హులైన వేలాది మంది ఎదురుస్తున్న ప్రభుత్వం పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో సుమారు 20 వేల వరకు ఉపాధ్యాయ ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని వివరించారు.

## దేశంలో తగ్గుముఖం పడుతున్న కరోనా కేసులు

న్యూఢిల్లీ,డిసెంబర్15(ఆర్ఎన్ఎ): ఇండియాలో కరోనా పాజిటివ్ కేసుల ఉధృతి కొద్దిమేర తగ్గింది. రోజుకు 90 వేలకు పైగా నమోదయ్యే కేసుల సంఖ్య ఇప్పుడు 20 వేలకు పడిపోయింది. రోజుకు 20 నుంచి 30 వేల మధ్య కేసులు నమోదవుతున్నాయి. తాజాగా భారత్‌లో 22,065 కేసులు నమోదయ్యాయి. దీంతో దేశంలో ఇప్పటి వరకు నమోదైన కరోనా కేసుల సంఖ్య 99,06,165కి చేరింది. ఇందులో 94,22,636 మంది కోలుకొని డిశ్చార్జ్ కాగా, 3,39,820 కేసులు యాక్టివ్ గా ఉన్నాయి. ఇక గడిచిన 24 గంటల్లో ఇండియాలో కరోనాతో 354 మంది మృతి చెందగా, దేశంలో నమోదైన మొత్తం కరోనా మరణాల సంఖ్య 1,43,709కి చేరింది.

## కస్టం మిల్లింగ్ రైస్ డెలివరీని వేగవంతం చేసి నిర్ణీత సమయంలో సివిల్ సప్లై కార్పొరేషన్‌కి చేర్చాలి

### – రైస్ మిల్లర్లకు ఆదేశించిన అదనపు కలెక్టర్ వీరారెడ్డి



సంగారెడ్డి డిసెంబర్ 15 (నేటినిజం ప్రతినిధి) సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా పౌరసరఫరాల అధికారి, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్,డిప్యూటీ తహసీల్దార్లు ,రైస్ మిల్లర్ల తో సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా నుండి ప్రతిరోజు రైస్ మిల్లర్లు(27ంఇ:నిబ) 7290 క్వింటాళ్ల కస్టమ్ మిల్లింగ్ రైస్ సివిల్ సప్లై కార్పొరేషన్ కి డెలివరీ చేయాలని, ఫిబ్రవరి 28లోగా మొత్తం కస్టమ్ మిల్లింగ్ రైస్ ను కార్పొరేషన్ గోడౌన్ లకు చేర్చాలని ఆదేశించారు. రైస్ మిల్లర్లు తమ వద్ద మిగిలిన అన్ని గోనె సంచుల ను లెక్క తో సహా సివిల్ సప్లై కార్పొరేషన్ జిల్లా మేనేజర్ కు అందజేయాలని సూచించారు.

ఈ సమావేశంలో జిల్లా పౌరసరఫరాల అధికారి శ్రీకాంత్ రెడ్డి, జిల్లా మేనేజర్ సుగుణ భాయ్, డిప్యూటీ తహసీల్దార్లు , రైస్ మిల్లర్లు పాల్గొన్నారు.

## జిల్లా ట్రెజరీ ఉపసంచాలకులుగా బాధ్యతలు స్వీకరించిన ..ఎం. కవిత



సంగారెడ్డి, డిసెంబర్ 15 (నేటినిజం ప్రతినిధి) సంగారెడ్డి జిల్లా ట్రెజరీ శాఖ ఉపసంచాలకులుగా ఎం.కవిత పదవి బాధ్యతలు స్వీకరించారు. వీరు తెలంగాణ ఇన్ఫర్మేషన్ కమిషన్ (రైట్ టు ఇన్ఫర్మేషన్ యాక్ట్) కార్యాలయంలో డిప్యూటీ సెక్రటరీ మరియు ఇన్చార్జి సెక్రటరీగా విధులు నిర్వహించారు.

నవంబర్ 30న ట్రెజరీ ఉపసంచాలకులు యు .శ్రీనివాస్ రావు ఉద్యోగ విరమణ పొందారు. అట్టి స్థానంలో( తన మాతృ శాఖకు) కవిత బదిలీపై వచ్చారు.

## కారు ప్రమాదంలో ఒకరు మృతి

### బాల్క సుమన్ గన్‌మెన్‌కు గాయాలు

పెద్దపల్లి,డిసెంబర్15(ఆర్ఎన్ఎ): పెద్దపల్లి జిల్లాలోని పెద్దకల్వల వద్ద మంగళవారం రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఒకరు మృతి చెందగా.. మరో ఇద్దరు గాయపడ్డారు. స్వాగత తోరణాన్ని కారు ఢీ కొట్టింది. ఈ ఘటనలో ఒకరు సంఘటనా స్థలంలోనే మృతి చెందగా.. మరో ఇద్దరు వ్యక్తులకు గాయాలయ్యాయి. మృతి చెందిన వ్యక్తిని మంచిర్యాలకు చెందిన సురేశ్ (30)గా గుర్తించారు. ప్రభుత్వ విప్, చెన్నూరు ఎమ్మెల్యే బాల్క సుమన్ గన్‌మెన్ సైతం ప్రమాదంలో గాయాలయ్యాయి.

# అవినీతి పోరాటంలో కానరాని చిత్తశుద్ధి

### బ్యాంకులను ముంచిన వారిపై కనిపించని చర్యలు
### అవినీతి పాలకుల భరతం పట్టే చట్టాలకు కదలని మోడీ

న్యూఢిల్లీ,డిసెంబర్15(ఆర్ఎన్ఎ): అవినీతిపై రాజీలేని పోరాటం చేస్తామని ప్రధాని మోడీ చేసి ప్రకటన ప్రకటనగానే మిగిలిపోయింది. అవినీతి సొమ్ములను రాబడతామని చెప్పినా సాధ్యం కావడం లేదు. బ్యాంకులను మంచేసి దర్జాగా విదేశాల్లో తిరుగుతున్న విజయ్ మాల్యా, నీరవ్ మోడీ లాంటి ఆర్థిక నేరస్థులను పట్టుకుని శిక్షించే ప్రయత్నాలు ముందుకు సాగడంలేదు. అలాంటి వారిని పట్టుకుని వారి ఆస్తులను జస్తు చేసి వుంటే ప్రజల్లో విశ్వాసం పెరిగేది. జిఎస్టీ వల్ల దేశంలో మార్పు వచ్చిందని ఘనంగా చెబుతున్న ప్రధాని దాని విపరీత పరిణామాలను కూడా పరిగణించడం లేదు.. అవినీతిని అంతమొందించే క్రమంలో చిత్తశుద్ధితో సాగితే ప్రజలు అండగా ఉంటారని గుర్తించాలి. ప్రధానిగా మోడీ బాధ్యతలు చేపట్టిన తరవాత ప్రజలు ఎంతో ఆశగా ఎదురు చూశారు. తమ బతుకుల్లో మార్పు వస్తుందని భావించారు. కానీ అలాంటి సందర్భాలు రాలేదు. ప్రభుత్వం పథకాల పేర్లు చెప్పి చాంతాడంత లిస్టు చదువుతూ వస్తుందే తప్ప ప్రజలకు నేరుగా ప్రయోజనం కలిగించే పనులేవీ జరగడం లేదన్న విషయాన్ని ప్రభుత్వం గుర్తించడం లేదు. నోట్లు రద్దు చేసినా, జిఎస్టీ వాతలు పెట్టినా భరిస్తున్నారు. ఈ భరింపు ఎంతకాలం అన్నది ప్రధాని మోడీ ఆలోచించుకోవాలి. ఇకనుంచి పేదలను దోచుకునేవారికి కంటి మీద కునుకు లేకుండా చేస్తామని, నిజాయితీ పరులకు ప్రోత్సాహం అందిస్తామని ప్రధాని పేర్కొన్నారు. జీఎస్టీతో కొత్త చరిత్ర సృష్టించా మని.. కొత్త పన్ను విధానానికి అందరి మద్దతు లభిస్తోందని తెలిపారు. మధ్యతరగతి వారి సొంతింటి కలను నిజం చేస్తామని హామి ఇచ్చారు. ఈ దేశం నిజాయతీ పరులదని అంటూనే ఇందులో అక్రమార్కులకు చోటు లేదన్నారు. అయినా రాజకీయ అవినీతిని రూపు మాపడంలో ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. వివిధ రాష్ట్రాల్లో పాలకులు అవినీతిలో కూరుకుపోయారు. గత కాంగ్రెస్ పాలనలో అనేక అవినీతి కార్యక్రమాలు జరిగాయి. అయినా వాటి గురించి ఆలోచన చేయడంలేదు. అవినీతి నేతలను బోను ఎక్కించే ప్రయత్నాలు చేయడం లేదు. బినామీ ఆస్తుల చట్టాన్ని తీసుకొచ్చి రూ.800కోట్ల ఆస్తులను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. జీఎస్టీని తీసుకొచ్చి సహకార వ్యవస్థకు జవసత్వాలు అందించామంటూ జీఎస్టీని ఇంత తక్కువ సమయంలో ఎలా అమలు చేశారని ప్రపంచం ఆశ్చర్య పోతోందన్నారు. నిజంగా అమలు చేయాలను కుంటున్న విషయాల్లో ఖచ్చితంగా ఉంటూ, మిగతా విషయాల్లో చట్టాలను అపహాస్యం చేస్తున్నారు. విద్య, వైద్యం ప్రజల ప్రాథమిక హక్కుగా ఉండాలంటూ రాజ్యాంగ సృష్టికర్తలు శ్రేయో రాజ్యాన్ని ప్రతిపాదించగా ఇన్నేళ్లయినా అది సాకారం కాలేదని ప్రస్తుత పరిస్థితులు చెబుతున్నాయి. వాటిని అధిగమించడానికి ప్రధానిగా మోడీ తీసుకున్న చర్యలు ఏంటన్నది కూడా అర్థం చేసుకోవచ్చు. ఏడు దశాబ్దాల స్వతంత్ర భారతంలో స్వేచ్ఛాఫలాలు సామాన్యుడి చెంతకు చేరలేదని నిత్యం ఘోషిస్తున్నా పాలకులకు పట్టడం లేదు. అన్నిరంగాలను నిర్వీర్యం చేసి కార్పొరేట్లకు సలాం కొడుతున్న ఆత్మగౌరవ రాహిత్యం తాండ విస్తోంది. జిఎస్టీ, నోట్ల రద్దు ప్రభావాలు వేధిస్తున్నా వాటి గురించి గొప్పలు చెప్పుకోవడం దారుణం కాక మరోటి కాదు. అడుగడుగునా పాలనా వైఫల్యం కనిపిస్తున్నా దానిగురించి కప్పిపుచ్చుకుంటూ ప్రచారార్భా టలు చేయడం అలవాటుగా మారింది. కుల, మతాల పేరుతో ఓట్లు దండుకునే కుటిల వ్యూహాలు, ప్రజలను బిచ్చగాళ్లను చేసే వాగ్దానాల వాగాడంబరాలు, విజ్ఞత లోపించిన నేతలు ప్రజలతో ఆడుకొనే క్రూర పరిహాసంగా మారింది. పెట్టుబడి దారుల, సామ్రాజ్యవాదుల పాదాక్రాంతం చేయడం అంబానీలు, అదానీల అంతులేని ధనార్తికి దోహదం చేయడం తప్ప సాధించేదేమి లేదని గుర్తించుకోవాలి. పాలకులు చిత్తశుద్ధిగా ప్రజల సంక్షేమాన్ని కోరుకుని ఉంటే భరాత చరిత్ర మరోలా ఉండేది.

# శరవేగంగా యాదాద్రి పనులు

### సందర్శకులను ఆకట్టుకునేలా నిర్మాణాలు

యాదాద్రి భువనగిరి,డిసెంబర్ 15(ఆర్ఎన్ఎ): యాదాద్రి క్షేత్రాభివృద్ధి పనులను వేగవంతం చేస్తున్నామని యాడా ఉపాధ్యక్షుడు కిషన్‌రావు తెలిపారు. దీనికితోడు కరోనా తగ్గుముఖం పట్టడంతో పలువురు యాదాద్రిని సందర్శించే అవకాశం కోసం చూస్తున్నారు. ఇక్కడ జరుగుతున్న పనులను పరిశీలించాలని, తెలుసు కోవాలన్న ఉత్సాహం ఉంది. దీంతో విదేశాల నుంచి వస్తున్న వారు యాదాద్రిని సందర్శించేందుకు రానున్నారు. దీంతో ఇక్కడికి వచ్చే ప్రతినిధులకు స్వామి దర్శనంతో పాటు, ఆలయ విస్తరణ విశేషాలను తెలిపేందుకు చర్యలు తీసుకుంటున్నారు. పనులన్నీ నిర్ణీత లక్ష్యం మేరకు సాగుతున్నాయని కిషన్‌రావు అన్నారు. లక్ష్యం మేరకు వచ్చే దసరా నాటికి ఆలయ పునర్నిర్మాణం పూర్తవుతుందని భావిస్తున్నారు. పుష్కరిణి విస్తరణ, కొండకింద కొత్త సింహద్వారం నిర్మాణాలు చేపడతామని ఆయన చెప్పారు. యాదాద్రి లో జరుగుతున్న రక్షణగోడ నిర్మాణం, లేఅవుట్ పుష్కరిణి విస్తరణ, సింహద్వారం నమూనా, ప్రణాళికలు సిద్ధమవుతున్నాయన్నారు. పనులను వేగవంతం చేసేందుకు సంబంధిత శాఖలన్నీ తమవంతు బాధ్యతగా కృషి చేయాలని కిషన్‌రావు ఆదేశించారు. యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామివారి ప్రధాన ఆలయ విస్తరణ కోసం అద్భుతమైన శిల్పాలు రూపుదిద్దుకుంటున్నాయి. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినా తట్టుకుని నిలబడేలా 2500 ఏండ్ల జీవితకాలం మన్నేలా శిల్పాలు పురుడుపోసుకుంటున్నాయి. పాదం నుంచి శిఖరం వరకు పలు అంతస్తులుగా నిర్మాణం కానున్న శిలాశోభిత రాజగోపురా లతో 2.33 ఎకరాల్లో నాలుగు వైపులా యాదాద్రి మాడవీధులు కనువిందు చేయనున్నాయి.

# వారం రోజుల్లో క్రైస్తవ భవన్ పనులు : మంత్రి శ్రీనివాస్ గౌడ్



మహబూబ్‌నగర్, డిసెంబర్ 15: గతంలో ఏ ప్రభుత్వం కూడా క్రైస్తవులను పట్టించుకోలేదని కానీ తెలంగాణ ఏర్పడ్డాక సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో వారి సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్నట్లు మంత్రి శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. క్రిస్మస్ సందర్భంగా స్థానిక ఎంబీసీ చర్చిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో క్రైస్తవులకు దుస్తులను పంపిణీ చేశారు. పేద క్రైస్తవులను అందరినీ అన్ని విధాల ఆదుకుంటామని ఆయన తెలిపారు. జిల్లా కేంద్రంలో వారం రోజుల్లో క్రైస్తవ భవన్ పనులు ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కేసీ నర్సింహులు, మార్కెట్ కమిటీ చైర్మన్ అమరేందర్ రాజు, అడిషనల్ కలెక్టర్ తేజస్ నందలాల్, క్రైస్తవ సోదరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# వరంగల్ కార్పోరేషన్‌పై బిజెపి కన్ను

### గత వైభవం సాధించే దిశగా అడుగులు

వరంగల్,డిసెంబర్15(ఆర్ఎన్ఎ): నాలుగైదు నెలలుగా నగరంలోని బీజేపీ నేతలు రాజకీయ కార్యకలాపాలను ఉధృతం చేశారు. టీఆర్ఎస్ నేతలతో ఢీ అంటే ఢీ అంటున్నారు. ప్రజా సమస్యలపై ఆందోళనలు చేస్తున్నారు. గత కార్పొరేషన్ ఎన్నికల్లో బీజేపీ ఒక్క డివిజన్ మాత్రమే గెలుచుకోగలిగింది.

2000 సంవత్సరంలో మేయర్ పీఠాన్ని కైవసం చేసుకున్న చరిత్ర ఉన్న బీజేపీ.. వచ్చే కార్పొరేషన్ ఎన్నికల్లో మళ్లీ సత్తా చాటాలని చూస్తోంది. ఇందుకోసం సరికొత్త వ్యూహాలను రచిస్తోంది. నగరంలోని మెజారిటీ డివిజన్లను గెలుచుకోవడానికి చేరికలు దోహదపడగలదని ఆ పార్టీ నేతలు భావిస్తున్నారు. అందుకే పలువురిని పార్టీలోకి ఆహ్వానించే ప్రయత్నాల్లో ఉన్నారు. తాజారాజకీయ రాజకీయ పరిణామాలకు చేరికలు దారితీయొచ్చని పలువురు భావిస్తున్నారు. రానున్న జీడబ్ల్యూఎంసీ ఎన్నికల్లో బీజేపీ విజయఢంకా మోగిం చాలన్న పక్కా ప్రణాళికతోనే పార్టీ నేతలు పావులు కదుపుతున్నట్లు కనిపిస్తోంది. ఇకపోతే కేంద్రం హృదయ్ పథకం కింద వరంగల్‌కు రూ. 48 కోట్లు విడుదల చేసింది. ఈ హృదయ్ నిధులతోనే భద్రకాళి బండ్ సుందరీకరణ పనులు, హెరిటేజ్ పథకం ద్వారా హన్మకొండ పద్మాక్షి దేవాలయానికి ఎదురుగా జైన మందిరంఅభివృద్ధి పనులు చేపట్టారు. ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న కాజీపేట రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులు కూడా కేంద్రం చొరవతోనే మొదలయ్యాయి. నగరంలో స్మార్ట్‌సిటీ, అమృత్ ప్రాజెక్టు పనులు కూడా సాగుతున్నాయి. కేంద్ర నిధులతో నగరాభివృద్ధి జరుగుతోందని ప్రచారం చేస్తున్నారు. ఇలా కేంద్ర నిధులను ప్రస్తావిస్తూ రాబోయే కార్పోరేషన్ ఎన్నికల్లో విజయసాధనకు అనుసరించాల్సిన వ్యూహంపై పార్టీశ్రేణులకు దిశానిర్దేశం చేయనున్నట్లు తెలుస్తోంది.

## జగన్ ఢిల్లీ పర్యటనపై సర్వత్రా ఆసక్తి

### రాష్ట్ర సమస్యలా..రైతుల సమస్యలపై చర్చనా?

అమరావతి,డిసెంబర్15(ఆర్ఎన్ఎ):ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి హఠాత్తు ఢిల్లీ పర్యటనపై ఆసక్తి నెలకొంది. మరోవైపు జగన్ సడన్ గా ఢిల్లీ వెళ్తుండటం వెనుక రాజకీయ కారణాలు కూడా ఉన్నాయన్న టాక్ బలంగా వినిపిస్తోంది.కేంద్రం పిలుపుతోనే సీఎం ఢిల్లీ వెళ్లినట్లు బీజేపీ వర్గాలు చెప్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వ్యవసాయ చట్టాలపై అమిత్ షా.. సీఎం జగన్ తో చర్చించనున్నట్లు తెలుస్తోంది. వ్యవసాయ చట్టాలను వ్యతిరేకిస్తూ జరిగిన భారత్ బంద్ కు వైసీపీ ప్రభుత్వం మద్దతిచ్చిన నేపథ్యంలో ఈ అంశంపై ఎలాంటి చర్చ జరగబోతుందన్నది ఆసక్తికరంగా మారింది. సాగు చట్టాలపై దేశవ్యాప్తంగా నిరసనలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. చట్టాలపై జాతీయ స్థాయిలో విస్తృతంగా ప్రచారం చేయాలని భావిస్తోంది. దేశవ్యాప్తంగా 700 మీడియా సమావేశాలు, 700 సదస్సులు నిర్వహించి కొత్త వ్యవసాయ చట్టాల వల్ల రైతులకు మేలే జరుగుతుందని వివరించాలని తీర్మానించింది. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్‌లో ఈ సదస్సులు విజయవంతం చేసేందుకు సహకరించాలని జగన్‌ను అమిత్ షా కోరనున్నట్లు బీజేపీ వర్గాలు తెలిపాయి. వివిధ రాష్ట్రాల సీఎంలు, ముఖ్య నేతలు కోరగానే అపాయింట్‌మెంట్ ఇచ్చేసి వారు ఇచ్చిన వినతిపత్రాలు స్వీకరించడం.., అదే సమయంలో వ్యవసాయ చట్టాలకు సహకరించాల్సిందిగా అమిత్‌షా తనదైన శైలిలో కోరుతున్నట్లు తెలుస్తోంది. అందులో భాగంగానే జగన్‌కు అడిగిన వెంటనే అపాయింట్‌మెంట్ ఇచ్చినట్లు ఢిల్లీ వర్గాలు చెప్తున్నాయి. కేంద్రమే జగన్‌ను ఢిల్లీకి పిలిపించిందని బీజేపీ వర్గాలంటున్నాయి. ప్రధానిని, ఇతర మంత్రులను కలిసే అవకాశం లేదని స్పష్టం చేశాయి. అలాగే కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాతో వైఎస్ జగన్ భేటీకానున్నారు. ఈ సమావేశంలో రాష్ట్రానికి సంబంధించిన సమస్యలు, కేంద్రం నుంచి రావాల్సిన నిధులపైనే ప్రధానంగా చర్చ జరగనుంది. ముఖ్యంగా ఇటీవల కురిసిన భారీ వర్షాలు, నివర్ తుఫాన్ ధాటికి దెబ్బతిన్న పంటలు, రోడ్లు, ఆస్తి నష్టాన్ని అమిత్ షా దృష్టికి తీసుకెళ్లి వెంటనే సాయం అందించాల్సిందిగా జగన్ కోరనున్నట్లు తెలుస్తోంది. అలాగే పోలవరం, విభజన సమస్యలను కూడా మరోసారి ప్రస్తావించే అవకాశముంది. తెలంగాణ సీఎం కేసీఆర్ హోం మంత్రిని కలిసిన మూడో రోజునే జగన్ కూడా షాను కలుస్తుండటం చర్చనీయాంశమైంది.

## రజనీ పార్టీ పేరు మక్కల్ సేవై కచ్చి ?

### పార్టీ గుర్తుగా ఆటో రిక్షా
### రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చలు

చెన్నై,డిసెంబర్15(ఆర్ఎన్ఎ):తన పొలిటికల్ ఎంట్రీపై ఇన్నేళ్లుగా ఊగిసలాట ధోరణిని కనపరిచిన తమిళ సూపర్ స్టార్ ఇటీవలే దానికి చెక్ పెట్టారు. రాజకీయాల్లోకి ప్రవేశించబోతోన్నట్లు వెల్లడించారు. దీనిపై ఈ నెల 31వ తేదీన అధికారిక ప్రకటన చేయబోతున్నారు. కొత్త సంవత్సరాన్ని పురస్కరించుకుని జనవరిలో పార్టీని ప్రారంభిస్తానని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో రజనీ పార్టీ పేరు, గుర్తులపై ఆసక్తికర చర్చ మొదలైంది. రజనీకాంత్ పార్టీ మక్కల్ సేవై కచ్చిగా నిర్ధారించే అవకాశాలు ఉన్నాయి. దీన్ని తెలుగులో చెప్పుకోవాలంటే.. ప్రజా సేవ పార్టీ అని అర్థం. ఎన్నికల గుర్తును ఆటోగా ఖరారు చేయొచ్చని తెలుస్తోంది. ఈ మేరకు రజనీకాంత్ కేంద్ర ఎన్నికల కమిషన్ కార్యాలయం అధికారులకు ప్రతిపాదనలను పంపించినట్లు తమిళ మీడియా వెల్లడించింది. కేంద్ర ఎన్నికల కమిషన్ ఈ ప్రతిపాదనలను ఆమోదించాల్సి ఉందని తెలిపింది. ఇందులో మార్పులు చేర్పులు చోటు చేసుకోవడానికి అవకాశాలు ఉండొచ్చని సమాచారం. ఇదివరకు రజనీకాంత్ ఎన్నికల గుర్తు సైకిల్‌గా ఉండొచ్చంటూ వచ్చిన వార్తలు పుకార్లేనని తేలిపోయినట్లు అభిప్రాయపడింది. నిజానికి– రజనీకాంత్ తన పార్టీ పేరును మక్కల్ శక్తి కజగంగా నిర్ధారించాలని భావించారు. ఈ పేరును అనుమతించాలని ఆయన కేంద్ర ఎన్నికల కమిషన్‌కు ప్రతిపాదనలను పంపించారు. దీన్ని ఈసీ తిరస్కరించినట్లు తమిళ మీడియా చెబుతోంది. అలాగే– 'బాబా ముద్ర'ను ఎన్నికల గుర్తుగా వినియోగించుకోవడానికి అనుమతి ఇవ్వాలని విజ్ఞప్తి చేయగా.. నిబంధనల ప్రకారం ఈసీ దీనికి అంగీకరించలేదని పేర్కొంది. .బాబా ముద్రకు బదులుగా ఆటోను కేటాయించినట్లు పేర్కొంది. రజనీకాంత్ నటించిన బాబా సినిమా ద్వారా ఆయన మేనరిజానికి సంబంధించిన ముద్ర అది. ఇదివరకు రజనీకాంత్ తన పేరు మీద పార్టీని రిజిస్ట్రేషన్ చేయించారు. రజనీ మక్కల్ మండ్రం పేరు మీద పార్టీ రిజిస్టర్ అయింది. దీన్ని పక్కన పెట్టారు. రజనీ మక్కల్ మండ్రం పేరుకు బదులుగా మక్కల్ సేవై కచ్చి పేరును ఖరారు చేయాలని ఈసీకి ప్రతిపాదనలను పంపించారు. రజనీ మక్కల్ మండ్రం ఏ మాత్రం క్రియాశీలకంగా ఉండకపోవడంతో పాటు పెద్దగా అచ్చి రావట్లేదని రజనీకాంత్ భావిస్తున్నారని ఆయన సన్నిహితులను ఉటంకించి తమిళ మీడియా పేర్కొంది. రాజకీయ పార్టీని ప్రకటించారు గానీ.. దాన్ని క్రియాశీలకంగా మార్చలేకపోయారు. తాజాగా– తన రాజకీయ రంగ ప్రవేశంపై రజనీకాంత్ స్పష్టత ఇవ్వడంతో ఆయన అభిమానుల ఆనందానికి హద్దు లేకుండా పోయింది. తమ ఆశయాలు, అకాంక్షలకు అనుగుణంగా ఆయన రాజకీయ ప్రస్థానం ఉంటుందని ఆశిస్తున్నారు. తమ తలైవాను ముఖ్యమంత్రిగా చూసుకుంటామని ఉద్వేగంతో చెబుతున్నారు. ఆటో రిక్షాను ఎన్నికల గుర్తుగా కేటాయించే అవకాశాలు ఉండటం వల్ల అభిమానుల ఆనందం రెట్టింపవుతోంది. ఆటో సామాన్య ప్రజలకు గుర్తుగా ఉంటుందని చెబుతున్నారు. భాషా సినిమాలో రజనీకాంత్ ఆటోడ్రైవర్‌గా నటించిన విషయాన్ని గుర్తు చేస్తున్నారు.

## మార్కెట్ యార్డులో దుకాణాల లూటీ

రంగారెడ్డి,డిసెంబర్15(ఆర్ఎన్ఎ): షాద్‌నగర్ పట్టణంలోని చౌడమ్మ గుట్ట వద్దనున్న ప్రభుత్వ మార్కెట్ యార్డులోని దుకాణాలను దొంగలు లూటీ చేశారు. దాదాపు ఎనిమిది ట్రేడర్స్ షాపులకు సంబంధించిన షెట్టర్లను ధ్వంసం చేసి అందులోకి చొరబడి.. సుమారు రూ.3లక్షల వరకు నగదును దోచుకువెళ్లినట్లు బాధిత ట్రేడర్స్ తెలిపారు. 2, 4, 5, 6, 16, 17, 21 నంబరు దుకాణాల్లో దొంగతనాలు జరిగాయని బాధితులు పేర్కొన్నారు. శివ శంకర్ ట్రేడింగ్ కంపెనీలో రూ. 1.70లక్షలు, రమణ దుకాణంలో రూ. 20వేలు, మల్లప్ప షాప్‌లో రూ. 30వేలు, ఓంసాయి ట్రేడర్స్‌లో రూ. 50వేలు, వేంకటేశ్వర ట్రేడర్స్‌లో రూ. 3వేలు, అమరవది కృష్ణయ్య షాపులో రూ. 3వేలు మల్లేశ్వరస్వామి షాపులో నగదును దోచుకెళ్లినట్లు బాధితులు తెలిపారు.

అర్ధరాత్రి జరిగిన దొంగతనాలపై ట్రేడర్స్ వర్గాలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. బిహార్‌కు చెందిన హమాలీలు పక్కనే ఉన్న షెట్టర్లలో పడుకున్నారు. అయితే తెల్లవారు జామున 4 గంటలకు లేచి చూడగా.. షెట్టర్లు పెకిలించి ఉన్నట్లు గుర్తించారు. వెంటనే యజమానులకు ఫోన్ చేయగా.. హుటాహుటిన యార్డు వద్దకు చేరుకొని పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి దర్యాప్తు ప్రారంభించారు.

# ఫైజర్‌కు సింగపూర్ ఆమోదం

### డిసెంబర్ చివరి నాటికి ప్రజలకు అందుబాటులోకి

న్యూఢిల్లీ,డిసెంబర్15(ఆర్ఎన్ఎ): ప్రపంచాన్ని గడగడలాడించిన కరోనాను కట్టడి చేసేందుకు వ్యాక్సిన్ తప్ప మరో మార్గం లేదు. అందుకే వివిధ దేశాలు వ్యాక్సిన్లను అభివృద్ధి చేసేందుకు సిద్ధమయ్యాయి. కాగా, అమెరికా సంస్థ ఫైజర్– బయోఎన్‌టెక్ రూపొందించిన వ్యాక్సిన్ ఇప్పటికే ఐదు దేశాల్లో అత్యవసర వినియోగానికి ఆమోద ముద్ర వేయించుకోగా..తాజాగా సింగపూర్ కూడా ఆమోదం తెలిపింది. డిసెంబర్ చివరి నాటికి ప్రజలకు అందివ్వనున్నట్లు ప్రధాని లీ హ్సీన్ లూంగ్ సోమవారం తెలిపారు. కాగా, ఫైజర్‌కు ఆమోదం తెలిపిన తొలి ఆసియా దేశంగా సింగపూర్ నిలిచింది. 2021 త్రైమాసానికల్లా దేశంలోని మొత్తం 5.7 మిలియన్ మందికి వ్యాక్సిన్ అందజేస్తామని చెప్పారు. దేశ పౌరులతో పాటు ఇక్కడ సుదీర్ఘంగా నివసిస్తున్న వారికి ఉచితంగా అందిస్తామని తెలిపారు. తొలుత ఆరోగ్య కార్యకర్తలతో పాటు, ఫ్రంట్ లైన్ వర్కర్లకు, వృద్ధులకు, అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారు, ప్రభుత్వ అధికారులతో పాటు తాను ఈ వ్యాక్సిన్ తీసుకోనున్నట్లు చెప్పారు. ఈ వ్యాక్సిన్ చాలా సురక్షితమని తెలిపేందుకు తాను తీసుకుంటున్నట్లు తెలిపారు. కాగా, ఈ వ్యాక్సిన్ల కోసం పలు సంస్థలతో ప్రభుత్వం ముందస్తు కొనుగోలు ఒప్పందం చేసుకుంది. మొత్తం వ్యాక్సిన్ల నిమిత్తం ఒక బిలియన్ డాలర్లను ఖర్చుచేయనున్నట్లు అధికారులు తెలిపారు.

# అప్రమత్తంగా ఉండాలి

### రాబోయే ఐదారు నెలలు తీవ్ర స్థాయికి కరోనా

### మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్ హెచ్చరిక

న్యూఢిల్లీ,డిసెంబర్15(ఆర్ఎన్ఎ): ఇప్పుడు దేశమంతటా కరోనా కేసులు తగ్గిపోతున్నాయి .. అయితే ఫ్యూచర్ లో కరోనా మళ్లీ విజృంభిస్తున్న అనే మాట అందరిని ఆలోచింప చేస్తుంది... కరోనా వైరస్ కేసులు దేశంలో చూస్తే వ్యాక్సిన్ వచ్చినా కూడా ఇప్పట్లో తగ్గిపోయేలా కనబడటం లేదు సైలెంట్ గా ఉంటూనే కరోనా పాజిటివ్ కేసులు తెచ్చిపెడుతుంది .. దీని బట్టి అర్థం అయ్యింది ఏంటంటే కరోనా ప్రభావం తగ్గలేదు అని ... కరోనా వైరస్ తర్వాతి నెలలలో మరింత తీవ్రం కానుంది అని మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్ అంటున్నారు.. ఆదివారం ఆయన మాట్లాడుతూ రాబోయే నెలల్లో మరింత భయంకరంగా కరోనా వైరస్ విజృంభించే అవకాశం ఉందని ఆ వైరస్ ప్రభావం ఇప్పట్లో తగ్గేది కాదని ప్రజలందరూ జాగ్రత్తగా ఉండాలని ఆయన సూచించారు.. కరోనా నిబంధనలను పాటిస్తే తప్పకుండా రాబోయే ముప్పును అడ్డుకట్ట వేయవచ్చని బిల్ గేట్స్ తెలిపారు .. ఇన్స్టిట్యూట్ ఫర్ హెల్త్ మెట్రిక్స్ ఆయన ఎవల్యూషన్ అంచనాల ప్రకారం రానున్న నెలల్లో లక్షల్లో మరణాలు సంభవించే అవకాశం ఉందని బిల్ గేట్స్ అంటున్నారు... అయితే మాస్కులు ధరించడం మరియు శానిటేషన్ పాటించడం వల్ల మరణాల సంఖ్య తగ్గించవచ్చని అంటున్నారు. నేను 2015 సంవత్సరం లోనే ఇటువంటి మహమ్మారి గురించి చెప్పానని ఈ సందర్భంగా బిల్ గేట్స్ గుర్తు చేశారు... అప్పుడే ఈ మహమ్మారి గురించి అంచనా వేసి మరణాల రేటు కూడా ఎక్కువగా ఉంటుందని అన్నారు .. అయితే కరోనా వ్యాక్సిన్ ప్రయోగాల కోసం బిల్ గేట్స్ ఫౌండేషన్ ఎల్లప్పుడు సహకారం అందిస్తుందని ఆయన స్పష్టం చేశారు.. అమెరికాలో ఇప్పటికే టీకా పంపిణీ ప్రారంభమైనప్పటికీ ప్రజలు చాలా జాగ్రత్తగా ఉండాలని బిల్ గేట్స్ తెలిపారు .. కరోనా నిబంధనలని మరువకూడదని వ్యాక్సిన్ వచ్చిన కూడా కరోనా నిబంధనలను పాటిస్తే రాబోయే రోజుల్లో మరింత కరోనా మరణాలు జరగకుండా మనల్ని మనం కాపాడుకోవచ్చని బిల్ గేట్స్ తెలిపారు .

# జనవరి 9న రెండో విడత జగనన్న అమ్మఒడి

### 10 నుంచి రిజిస్ట్రేషన్లకు అవకాశం

### 26న లబ్దిదారుల తుది జాబితా

### మార్గదర్శకాలు విడుదల చేసిన విద్యా శాఖ మంత్రి

అమరావతి,డిసెంబర్15(ఆర్ఎన్ఎ): ఆంధ్రప్రదేశ్‌లో జనవరి 9న జగనన్న అమ్మఒడి రెండో విడత సొమ్ములు ఖాతాల్లో జమ చేయనున్నట్లు విద్యాశాఖ మంత్రి ఆదిమూలపు సురేశ్ వెల్లడించారు. అమ్మఒడి పొందేందుకు ఈ నెల 10 నుంచి 20వ తేదీ వరకు రిజిస్ట్రేషన్లకు అవకాశం కల్పిస్తున్నట్లు చెప్పారు. ఈ నెల 16-19 వరకు లబ్ధిదారుల ప్రాథమిక జాబితా విడుదల చేస్తామని, 20-24 మధ్య జాబితాలో తప్పుల సవరణకు అవకాశం కల్పిస్తున్నామని తెలిపారు. 26న అమ్మఒడి లబ్ధిదారుల తుది జాబితాను వెలువరిస్తామన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ అమ్మఒడి పథకం అందజేస్తామని మంత్రి సురేశ్ వెల్లడించారు. గతేడాది 43.54 లక్షల మంది లబ్ధిదారులకు ఈ పథకం కింద రూ.6,336 కోట్లు పంపిణీ చేశామన్నారు. అలాగే, రాష్ట్రంలో టీచర్ల బదిలీ ప్రక్రియ పారదర్శకంగా జరుగుతోందన్నారు. నాలుగు కేటగిరీలుగా విభజించి బదిలీలు చేపడుతున్నామన్నారు. కొన్ని పాఠశాలల్లోని ఖాళీలు భర్తీ చేసేందుకే బదిలీ ప్రక్రియ చేపట్టినట్లు మంత్రి వివరించారు.

# 1975 ఎమర్జెన్సీ రాజ్యాంగ విరుద్ధం

### -సుప్రీంకోర్టులో 94 ఏండ్ల బామ్మపిటిషన్

న్యూఢిల్లీ,డిసెంబర్15(ఆర్ఎన్ఎ): 1975లో అప్పటి ప్రధాని ఇందిరా గాంధీ దేశంలో ప్రకటించిన అత్యవసర పరిస్థితి(ఎమర్జెన్సీ)పై సుప్రీంకోర్టులో ఒక పిటిషన్ దాఖలైంది. ఈ నిర్ణయాన్ని రాజ్యాంగ విరుద్ధమని ప్రకటించాలంటూ 94 ఏళ్ల వృద్ధురాలు వీరా సారిన్ సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దీంతో దీన్ని విచారణకు స్వీకరించిన జస్టిస్ ఎస్‌కే కౌల్ నేతృత్వంలోని సుప్రీంకోర్టు ధర్మాసనం కేంద్రప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. పిటిషన్‌పై స్పందించాలని ఆదేశించింది. 1975 నాటి ఎమర్జెన్సీ రాజ్యాంగ విరుద్ధంగా ప్రకటించాలని వీరా సారిన్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఆమె అభ్యర్థనను విచారించేందుకు ఎస్‌కే కౌల్ ధర్మాసనం అంగీకరించింది. అయితే, 45ఏళ్ల విరామం తర్వాత వచ్చిన ఈ అభ్యర్థన అసలు విచారణకు సాధ్యమైనదా.. అవసరమైనదా.. అనే అంశాలను కూడా పరిశీలిస్తామని ధర్మాసనం వెల్లడించింది. ' చరిత్రలో ఒక నిర్దిష్ట సమయంలో ఏదో తప్పు జరిగివుండొచ్చు. కానీ, ఎమర్జెన్సీ విధించి 45 సంవత్సరాలు పూర్తయింది. అప్పటి వ్యక్తులు ఇప్పుడు మనతో లేరు' అని పేర్కొంది. దీనిపై నిర్ణయం తీసుకునేందుకు ఇది సరైన సమయం అని సారిన్ తరఫున కోర్టుకు హాజరైన న్యాయవాది సాల్వే అన్నారు. ఇందిరా గాంధీ ప్రధానమంత్రిగా ఉన్న సమయంలో 1975 జూన్ 15వ తేదీన దేశంలో ఎమర్జెన్సీ ప్రకటించిన విషయం తెలిసిందే. దాదాపు 21 నెలలపాటు కొనసాగిన ఆ అత్యయికస్థితిని 1977 మార్చి నెలలో ఎత్తివేశారు.

# కాంగ్రెస్‌పై ఆపరేషన్ ఆకర్ష్

### తెలంగాణలో అధికారమే లక్ష్యంగా బీజేపీ ఎత్తుగడలు

### బీజేపీలోకి మరో మాజీ మంత్రి

### ఫలించిన అరుణ మంత్రాంగం

### ఈనెల 28న బీజేపీలో చేరనున్నట్లు చంద్రశేఖర్ ప్రకటన

హైదరాబాద్,డిసెంబర్14(ఆర్ఎన్ఎ): దుబ్బాక ఉపఎన్నికలో ఘన విజయం.. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో ఊహించని ఫలితాలతో ఫుల్ స్వింగ్‌లో ఉన్న బీజేపీ రాష్ట్ర నాయకత్వం.. తెలంగాణలో అధికారమే లక్ష్యంగా పావులు కదుపుతోంది. పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసేందుకు పూనుకుంది. ఇందులో భాగంగా ఇతర పార్టీలకు చెందిన బలమైన నేతలు తమ పార్టీలోకి లాగేందుకు రాయబారాలు సాగిస్తోంది. ఇప్పటికే అధికార టీఆర్ఎస్ పార్టీ సహా, కాంగ్రెస్ పార్టీల నుంచి పలువురు బడా నేతలు బీజేపీలో చేరారు. తాజాగా బీజేపీ మహిళా నాయకురాలు డీకే అరుణ కాంగ్రెస్ పై ఆపరేషన్ ఆకర్ష్ చేపట్టారు. ఈ ఆపరేషన్ ఆకర్ష్ చివరికి ఫలితాన్ని ఇచ్చింది. డీకే అరుణ ప్రయత్నాల కారణంగా మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత చంద్రశేఖర్ బీజేపీలో చేరేందుకు సుముఖత వ్యక్తం చేశారు. ఈనెల 28వ తేదీన బీజేపీలో చేరనున్నట్లు చంద్రశేఖర్ ప్రకటించారు. బీజేపీ జాతీయ నాయకుల సమక్షంలో ఆయన కాషాయ కండువా కప్పుకోనున్నారు. ఇందుకు వికారాబాద్‌లో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నారు. చంద్రశేఖర్ బీజేపీ తీర్థం పుచ్చుకునే ముందు రోజున అంటే ఈనెల 27వ తేదీన వికారాబాద్‌లో మహాయజ్ఞం చేయతలపెట్టారు. ఇదిలాఉండగా, చంద్రశేఖర్ పార్టీ మారకుండా ఉండేందుకు కాంగ్రెస్ నేతలు చేసిన ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి. సీనియర్ నేతలంతా స్వయంగా ఆయన నివాసానికి వచ్చి మరీ బుజ్జగించినా ఫలితం లేకుండా పోయింది. మొత్తంగా కాంగ్రెస్ పార్టీకి ఝలక్ ఇస్తూ బీజేపీలోకి చేరబోతున్నట్లు ప్రకటించేశారు చంద్రశేఖర్. 1985 నుండి 2004 వరకు వికారాబాద్ నుండి వరుసగా ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన చంద్రశేఖర్.. మంత్రిగా కూడా బాధ్యతలు నిర్వహించారు. మరోవైపు చంద్రశేఖర్ మాత్రమే కాదని, కాంగ్రెస్ పార్టీకి చెందిన ఇంకా చాలా మంది సీనియర్లు త్వరలోనే బీజేపీ గూటికి చేరుతారని కమలం పార్టీ నేతలు చెబుతున్నారు. అధికార టీఆర్ఎస్ పార్టీ నేతలు సైతం తమకు టచ్‌లో ఉన్నారని, సరైన సమయంలో వారు కూడా బీజేపీ కండువా కప్పుకుంటారని అంటున్నారు. ఇప్పటికే టీఆర్ఎస్ పార్టీ నుంచి స్వామి గౌడ్ కాషాయ కండువా కప్పుకోగా.. కాంగ్రెస్ పార్టీకి చెందిన విజయశాంతి, గూడురు నారాయణ బీజేపీలో చేరారు.

# బీజేపీలోకి ఎర్రబెల్లి ప్రదీప్ రావు?

### ఊపందుకున్న ఊహాగానాలు

### ఆయనతో పాటు కమలం గూటికి మరికొందరు

వరంగల్,డిసెంబర్15(ఆర్ఎన్ఎ): టీఆర్ఎస్ అసంతృప్త నేతలకు ప్రస్తుతం బీజేపీ రూపంలో ప్రత్యామ్నాయం దొరికింది. ఇప్పటి వరకూ ఆ పార్టీలో ఉన్న అసంతృప్తులంతా బీజేపీ వైపు చూస్తున్నారు. తాజాగా.. టీఆర్ఎస్ నేత, మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు సోదరుడు ఎర్రబెల్లి ప్రదీప్ రావు బీజేపీలో చేరేందుకు రంగం సిద్ధం చేసుకున్నట్టు ప్రచారం జరుగుతోంది. ప్రదీప్ రావు వరంగల్ తూర్పు నియోజకవర్గంపై కన్నేసినట్టు తెలుస్తోంది. ఈ క్రమంలోనే బీజేపీలో చేరేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నట్టు సమాచారం. పార్టీ మారడం వల్ల ఎలాంటి నష్టం లేదని టీఆర్ఎస్ నేతలు చెబుతున్నారు.

తమ పార్టీలో పక్కకు పెట్టిన వారు పార్టీ మారడం సహజమేనని దీనిపై ఎర్రబెల్లి దయాకర్‌రావు వ్యాఖ్యానించినట్టు తెలుస్తోంది. వరంగల్ జిల్లాలో అనేకమంది నేతలు బిజెపిలో చేరేందుకు ఆసక్తిగా ఉన్నారని సమాచారం. ముఖ్యంగా కార్పోరేషన్ ఎన్నికల్లో పాల్గొనాలని భావిస్తున్న వారు ముందే సర్దుకుంటున్నారు. గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్‌లో బీజేపీ మంచి ఫలితాలు సాధించిన నేపథ్యంలో.. చేరికలకు ప్రాధాన్యం సంతరించుకున్నది. మరో మూడు నెలల్లో వరంగల్ మహానగర పాలక సంస్థ ఎన్నికలు జరగనున్న తరుణంలో రాజకీయ చేరికలకు అవకావం రానుంది. దుబ్బాక ఉపఎన్నికలో గెలుపు తర్వాత అందరి దృష్టి బీజేపీ వైపు మళ్లింది. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో రికార్డు స్థాయిలో 48 డివిజన్లను గెలుచుకొని అధికార టీఆర్ఎస్ పార్టీకి సవాల్ విసిరింది. రాబోయే వరంగల్, ఖమ్మం కార్పొరేషన్ ఎన్నికల్లోనూ కాషాయ జెండా ఎగురవేయడానికి ఇప్పటి నుంచే కసరత్తు ప్రారంభించింది. తెలంగాణలో బీజేపీ ప్రాభవం పెరుగుతుండడంతో ఆ పార్టీలోకి వలసలు మొదలయ్యాయి. కాంగ్రెస్‌తో పాటు టీఆర్ఎస్‌లోని అసంతృప్త నేతలు, కార్యకర్తలు కమలం నీడన చేరుతున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో బీజేపీలోకి వలసలు ఏడాది క్రితమే ప్రారంభమయ్యాయి. ఈ మధ్యకాలంలో మరింత జోరందు కున్నాయి. టీడీపీ నుంచి పలువురు నేతలు ఇది వరకే కాషాయ కండువాలు కప్పుకున్నారు. రాజ్యసభ మాజీ సభ్యుడు గరికపాటి మోహన్‌రావు, మాజీ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డితో పాటు పలువురు అగ్రశ్రేణి నాయకులు బీజేపీలో చేరారు. జీహెచ్ఎంసీ ఎన్నికల తర్వాత తాజాగా మరికొందరు కూడా ఆ పార్టీ వైపు చూస్తున్నారు. ఇటీవల వివిధ పార్టీలకు చెందిన అచ్చ విద్యాసాగర్, ఆకారపు మోహన్, మట్ట రాజేశేఖర్‌రెడ్డి, కూర నరేందర్ గౌడ్ బీజేపీలో చేరినవారిలో ఉన్నారు. ఇదే క్రమంలో టీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, వరంగల్ అర్బన్ కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు కూడా బీజేపీ గూటికి చేరేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇటీవలే బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌ని కలిసి మంతనాలు జరిపారు. ఆయన హైదరాబాద్‌లో సంజయ్ సమక్షంలోనే తన అనుచర గణంతో చేరేందుకు ఏర్పాట్లు చేసుకుంటు న్నట్టు తెలుస్తోంది. అలాగే కాంగ్రెస్‌లో సుదీర్ఘకాలం పనిచేసి రెండేళ్ల క్రితం టీఆర్ఎస్‌లో చేరిన రాజనాల శ్రీహరి కూడా బీజేపీలో చేరేందుకు రంగం సిద్ధం చేసుకున్నట్టు తెలిసింది. వివిధ పార్టీలకు చెందిన నగరంలోని మరికొందరు ముఖ్యనాయకులు త్వరలో బీజేపీలో చేరేందుకు సిద్ధమవుతున్నారు.

# ఉద్యోగం,వృత్తి ఏదైనా ఆత్మవిశ్వాసం ముఖ్యం

### యువత ఆలోచించాలంటున్న నిపుణులు

హైదరాబాద్,డిసెంబర్15(ఆర్ఎన్ఎ): ఒక పక్క దేశంలో నిరుద్యోగ సమస్య తీవ్రంగా వుంది. కరోనాతో ఈ పరిస్థితి తీవ్రంగా ఉంది. మరోపక్క అన్ని రంగాల్లో సరైన నైపుణ్యం ఉన్న వ్యక్తులు దొరకడంలేదు అని ఆయా రంగాల్లో నిపుణులు చెబుతున్నారు. ఈ వైరుధ్యాన్ని ఎలా అర్థం చేసుకోవాలి. ఏదైనా గ్రామంలోకి వెళ్లి ఒక రైతుని మీకు ఎదురవుతున్న ప్రధాన సమస్య ఏమిటని అడగండి. వ్యవసాయానికి కూలీలు దొరకడం లేదు అంటారు. పట్టణంలోకి వెళ్లి ఒక హోటల్ యజమానిని అడగండి. కుక్స్, వెయిటర్స్, ఫ్రంట్ ఆఫీస్ పనులు చేయడానికి సరైన వ్యక్తులు దొరకడం లేదు అంటారు. ఇటీవలి కరోనా దెబ్బతో వర్కర్ల సమస్య తీవ్రంగా ఉంది. మరోవైపు గల్ఫ్‌లో ఉద్యోగాలు వెతుక్కునే వారి సంఖ్యా పెరుగుతోంది. అసలు ఈశాన్య భారతదేశం వారు ఉండబట్టి సరిపోయింది. లేకపోతే పెద్ద క్రైసిస్ వచ్చివుండేది' అని ఒక హోటల్ యజమాని అంటున్నాడు. భవన నిర్మాణ దారుణ్ని అడగండి ప్లంబర్లు, ఫిట్టర్లు మొదలైన వారు దొరకడం లేదు అంటారు. మారిషస్ వాళ్ళకు అక్కడ పురోహితుడు, కుక్ కావాలి దొరకడం లేదు సాయం చెయ్యండి అని వారు అడుగుతున్నారు..హోటల్స్‌లో దోశ మాస్టర్ కు ఇరవై ముప్పై వేలు ప్రారంభ జీతం వుంది. అదే ఇంజనీర్లు పది వేల జీతానికి కూడా క్యులో నిల్చుంటున్నారు... సమస్య ఎక్కడ వుంది అంటే అందరికి వైట్ కాలర్ జాబ్‌లే కావాలి. జీతం ఎక్కువ వస్తుంది అని కాదు. చాల సెమి స్కిల్డ్ జాబ్స్ కు రెండు మూడు రెట్లు ఎక్కువ జీతం వస్తుంది. ఈరోజు ప్రభుత్వ టీచర్ ప్రారంభ జీతం దాదాపు 50 వేలు. అదే పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేసిన డాక్టర్ సర్జన్ జీతం నలభై వేలు. మన వారు ఒక్కో జాబ్‌కు ఒక్కో సోషల్ స్టేటస్ అంటగట్టేసారు. ఇంజనీర్ డాక్టర్ అంటే గొప్ప అని టీచర్ అంటే ఏదో పనికి రాని జాబ్ అని. ప్లంబర్, ఫిట్టర్ లాంటి పనులు చేస్తున్నాను అంటే అమ్మాయి కూడా దొరకని పరిస్థితి. అంతెందుకు పురోహిత్యం చేసే వారికి విదేశాల్లో చాల డిమాండ్ వుంది. అయినా పురోహితుడితో పెళ్ళికి అమ్మాయిలు ముందుకు రాని స్థితి. అదేవిధంగా సొంత వ్యాపారాలు చెసుకునే వారికి అమ్మాయిలు ఇవ్వటం లేదు.కంప్యూటర్ ఇంజనీర్ అని చెప్పుకొంటూ ఆరు నెలలుగా జీతాలు ఇవ్వక పోయినా కేవలం ప్రెస్టేజ్ కోసం పని చేసేవారు వున్నారు. అదే హోటల్‌లో కుక్ గా వెయిటర్ గా చెయ్యమంటే నామోషీ. తలతీసినట్టు ఫీల్ అవుతారు. ఇదే మనవారు అమెరికాకు వెళితే అక్కడ హోటల్‌లో పనిచెయ్యడానికి సిద్ధపడుతారు...అంటే ఇక్కడ మారాల్సింది సామజిక దృక్పథం. దొంగతనం, అడుక్కోవడం తప్ప ఏ పని చేసినా తప్పులేదు. అన్ని పనులు గొప్పవే. మీ మనసుకు నచ్చిన ఫీల్డ్ ఎంచుకోండి. అతిచిన్న ఉద్యోగమైనా పరవాలేదు. చేతినిండా పని ఉండాలి, ఎంతో కొంత ఆదాయం ఉండాలి. చేస్తున్న పనిపై మనసు లగ్నం చెయ్యాలి. అంచెలంచె లుగా ఎదగాలి. పదిమందికి ఉపాధి కల్పించే స్థాయికి చేరుకోవాలి. పాన్ డబ్బా పెట్టుకొన్న పరవా లేదు. కర్రీ షాప్ పెట్టుకొన్న పరవా లేదు...'మీరే రాజు... మీరే మంత్రి...' డిప్రెషన్ అనవసరం. ఆత్మ విశ్వాసం, కృషి, పట్టుదల, మారిన పరిస్థితులకు అనుగుణంగా మారడం అవసరం.

# అమరావతి నిరసనలకు ఏడాది

### 17న భారీ బహిరంగ సభకు జెఎసి ఏర్పాట్లు

### ఉద్దండరాయుని పాలెం వేదికగా ఐక్యత చాటే యత్నాలు

అమరావతి,డిసెంబర్15(ఆర్ఎన్ఎ): అమరావతిని రాజధానిగా కొనసాగించాలంటూ రైతులు, మహిళలు చేస్తున్న ఆందోళన ఏడాది పూర్తి చేసుకుంటోంది. ఒక్క వైకాపా తప్ప అందరూ ఒక్కటే రాజధాని.. దికూడా అమరావతి కొనసాగాలని కోరుకుంటున్నారు. అయితే అధికార వైకాపా మాత్రం మూడు రాజధానులు కుంపటి రాజేసింది. మొత్తంగా అమరావతిలో ఆందోళనలు మొదలై ఏడాది పూర్తవుతోన్న సందర్భంగా ఈనెల 17న భారీ కార్యక్రమాలు నిర్వహించేందుకు అమరావతి పరిరక్షణ సమితి జాయింట్ యాక్షన్ కమిటీ (ఏపీఎస్‌జేఏసీ) ప్రణాళికలు సిద్ధం చేసింది.డిసెంబర్ 17 నాటికి ఏడాది పూర్తి కానున్న సందర్భంగా అమరావతి పరిరక్షణ సమితి ఉద్యమ కార్యాచరణ ప్రకటించింది. గురువారం నాడు ప్రధాని మోదీ అమరావతికి శిలాన్యాసం చేసిన ఉద్దండరాయునిపాలెంలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తారు. మూడు రాజధానుల నిర్ణయాన్ని జగన్ సర్కారు వెనక్కి తీసుకుని, అమరావతిలోనే రాజధాని అని ప్రకటించే వరకు ఉద్యమం ఆగబోదని జేఏసీ నేతలు స్పష్టం చేశారు. మరోవైపు రాజధాని వివాదానికి సంబంధించిన పిటిషన్ల విచారణ కూడా తుది దశకు చేరింది. సంక్రాంతిలోపే తుది తీర్పులు వెలువడే అవకాశాలున్నాయి. రాష్ట్ర విభజనతో తీవ్రంగా నష్టపోయిన ఆంధ్రప్రదేశ్.. వరల్డ్ క్లాస్ క్యాపిటల్ సిటీ ఉంటే తప్ప ఆర్థికాభివృద్ధి సాధించలేదని చెప్పిన నాటి సీఎం చంద్రబాబు అమరావతి నిర్మాణానికి అంకురార్పణ చేశారు. భారత ప్రధాని నరేంద్ర మోదీ ముఖ్యఅతిధిగా ఉద్దండరాయునిపాలెంలో రాజధాని నగర నిర్మాణానికి 2015 అక్టోబర్ 22న శంకుస్థాపన జర్గా, ఏడాదిన్నర లోపే సచివాలయం, అసెంబ్లీ, హైకోర్టులను నిర్మించారు. కానీ అవి శాశ్వత భవనాలు కావని, కేవలం తాత్కాలిక నిర్మాణాలని ప్రభుత్వమే పేర్కొంది. నాలుగేళ్ల సమయంలో ఆ మూడు తాత్కాలిక భవంతులు తప్ప చంద్రబాబు గ్రాఫిక్ లో చూపించిన నిర్మాణాలేవీ అక్కడ చోటుచేసుకోలేదు. 2019 మేలో వెల్లడైన అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో చంద్రబాబు చిత్తయిపోయి, జగన్ సీఎం అయ్యారు. జీఎస్ రావు, బోస్టన్ తదితర కమిటీల సూచనలు, సలహాల మేరకు ఏపీకి అమరావతి ఒక్కటే రాజధానిగా ఉండబోదని, మొత్తం మూడు రాజధానులు ఉంటాయని 2019 డిసెంబర్ 17 సీఎం జగన్ అసెంబ్లీ సాక్షిగా క్లారిటీ ఇచ్చారు. అదే రోజు నుంచి అమరావతిలో రైతుల నిరసలు మొదలయ్యాయి. ఏడాది కాలంగా రాజధానిపై గందరగోళం కొనసాగుతూనే ఉంది..జగన్ సీఎం అయితే అమరావతిని తరలిస్తారని ఎన్నికలకు ముందు ప్రచారం జరగ్గా, వాటిని వైసీపీ ఖండించింది. కానీ అనుమానించినట్లుగానే సీఎం అదే పని చేశారు. కాకుంటే పరిపాలన వికేంద్రీకరణ కోసమే మూడు రాజధానులు ఏర్పాటుచేస్తున్నట్లు అధికారికంగా చెప్పారు. అమరావతి శాసన రాజధానిగా కొనసాగుతుందని, కార్యనిర్వాహక రాజధానిగా విశాఖపట్నం, న్యాయరాజధానిగా కర్నూలు ఉంటాయని తెలిపారు. మరోవైపు చంద్రబాబు హయాంలో అమరావతిలో జరిగిన భూపందేరాలపైనా జగన్ సర్కారు విచారణ జరిపించింది. రాజధాని అమరావతి అంశంతో ముడిపడిన అన్నిటికి అన్ని విషయాల్లో జగన్ సర్కారుకు కోర్టుల్లో భారీ ఎదురుదెబ్బలు తగిలాయి. రాజధానిని అమరావతి నుంచి తరలించడాన్ని సవాలు చేస్తూ కోర్టుల్లో వందలకొద్దీ పిటిషన్లు దాఖలయ్యాయి. మూడు రాజధానుల బిల్లును తిప్పిపంపిన మండలిని రద్దు చేయాలన్న నిర్ణయం కూడా వివాదాస్పదమైంది. ప్రభుత్వం మూడు రాజధానుల్ని నోటిఫై చేసిన తర్వాత కూడా కోర్టులు వాటిని నిలిపేశాయి. ఇలా అమరావతితో ముడిపడిఉన్న ప్రతి అంశంలో తనకు వ్యతిరేక తీర్పులు వస్తుండటంతో వైసీపీ అధినేత జగన్ ఏకంగా జడ్జిలపైనే పోరాటానికి దిగారు. హైకోర్టులోని కొందరు జడ్జిలు, సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ ఎన్వీ రమణలపై చీఫ్ జస్టిస్ బోబ్డేకు సీఎం జగన్ ఫిర్యాదు లేఖరాయడం దేశచరిత్రలోనే అరుదైన ఘట్టంగా నిలిచింది.

# సంక్షేమ కార్యక్రమాలు ఆపేస్తే తెలుస్తుంది

### 24 గంటలు కాదు..మూడునాలుగు గంటల కరెంట్ ఇస్తే తెలుస్తుంది

### మాజీమంత్రి లక్ష్మారెడ్డి సంచలన వ్యాఖ్యలు

మహబూబ్‌నగర్,డిసెంబర్15 (ఆర్ఎన్ఎ): మాజీ మంత్రి లక్ష్మారెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. జనాలకు మంచిచేస్తే మరిచిపోయే అలవాటుందని, ఏడాదిపాటు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను రద్దు చేయాలని కేసీఆర్‌ను కోరాలని ఉందన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన పట్టణ ప్రకృతి వనం ప్రారంభోత్సవం సందర్భంగా లక్ష్మారెడ్డి పలు వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. సభలో మా ట్లాడుతూ.. జనాలకు మంచిచేస్తే మరిచి పోయే అలవాటు ఉందన్నారు. సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను రద్దు చేయాలని సీఎంను కోరాలని ఉందన్నారు. 24 గంటల కరెంట్ కాకుండా.. కేవలం 3,4గంటల కరెంట్ ఇవ్వాలని కోరుతానని లక్ష్మారెడ్డి తెలిపారు. సంక్షేమ పథకాలను ప్రస్తుతం నిలిపివేసి.. ఎన్నికలకు ఏడాది ముందు మళ్లీ ప్రారంభిస్తే బాగుంటుందని లక్ష్మారెడ్డి పేర్కొ న్నారు. మేము చేస్తున్న మేలు సామాన్యులకు అర్థం కావడంలేదు. జనం మంచివారన లా.. అమాయకులనాలో తెలియడంలేదు. పనికి మాలిన భావాలకు లోనవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు సంక్షేమ పథకాలను ఆపేసి ఎన్నికలు ఏడాది ఉన్నా యనగా మళ్లీ ప్రారంభిస్తే బాగుంటుంది' అంటూ మాజీ మంత్రి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు.

# భారత్‌లో త్వరలోనే అందుబాటులోకి రానున్న కొవిడ్ వ్యాక్సిన్

### టీకా పంపిణీపై మార్గదర్శకాలు విడుదల చేసిన కేంద్రం

### తొలి దశలో ఆరోగ్య సిబ్బందికి ప్రాధాన్యం

న్యూఢిల్లీ,డిసెంబర్15(ఆర్ఎన్ఎ): భారతదేశంలో కొవిడ్19కు వ్యాక్సిన్ త్వరలోనే అందుబాటులోకి రానునట్లు కేంద్ర ప్రభుత్వ పెద్దలు ఇప్పటికే సంకేతాలు ఇచ్చారు. ఇందుకు తగినట్లుగా టీకా పంపిణీపై కేంద్రం ప్రభుత్వం ముందస్తు ఏర్పాట్లు చేస్తుంది. తాజాగా వ్యాక్సిన్ పంపిణీపై కేంద్రం వివరణాత్మక మార్గదర్శకాలు విడుదల చేసింది. రోజుకు ప్రతి సెషన్‌లో 100 -200 మందికి టీకాలు వేయడం, ఏదైనా ప్రతికూల ప్రభావం కనిపిస్తే వెంటనే వైద్యం అందించేలా 30 నిమిషాలు వారిని పర్యవేక్షించడం మరియు ఒకేసారి ఒక లబ్ధిదారుని మాత్రమే అనుమతించడం వంటివి కొవిడ్ ఇనాక్యులేషన్ డ్రైవ్ కోసం కేంద్రం జారీ చేసిన మార్గదర్శకాలలో ఉన్నాయి. ఇటీవల రాష్ట్రాలకు జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం, కొవిడ్ వ్యాక్సిన్ ఇంటెలిజెన్స్ నెట్‌వర్క్ (కోవిన్) వ్యవస్థ కరోనావైరస్ వ్యాక్సిన్ల కోసం నమోదు చేయబడిన లబ్ధిదారులను రియల్ టైమ్ ప్రాతిపదికన గుర్తించడానికి ఉపయోగించబడుతుంది. మొదటి విడతలో హెల్త్‌కేర్ సిబ్బంది, ఫ్రంట్‌లైన్ కార్మికులు, 50 ఏళ్ళు పైబడిన వారు, 50 ఏళ్ల లోపు ఉండి ఇతర దీర్ఘకాలిక రోగాలు కలిగిన వారితో సహా దాదాపు 30 కోట్ల మందికి టీకాలు వేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. అలాగే నిర్దిష్ట తేదీ వరకు ఎంత మోతాదు వ్యాక్సిన్ వినియోగించబడింది, ఎంత మంది ప్రయోజనం పొందారు, ఏమైనా ఇబ్బందులున్నాయా? మొదలగు అన్ని విషయాలను ఎప్పటికప్పుడు తెలియజేయాల్సిందిగా రాష్ట్రాలను కోరింది.

# మెరుగైన బుద్ధదేవ్ ఆరోగ్యం

కోల్‌కత్తా,డిసెంబర్15(ఆర్ఎన్ఎ): పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి, సిపిఎం సీనియర్ నేత బుద్ధదేవ్ భట్టాచార్య ఆరోగ్య పరిస్థితి మెరుగైంది. దీంతో ఆయన్ను మంగళవారం ఆసుపత్రి నుంచి డిశ్చార్జి చేసే అవకాశం ఉందని సంబంధిత వైద్య అధికారులు సోమవారం తెలిపారు. చికిత్సకు బుద్ధదేవ్ బాగా, వేగంగా స్పందించారని, డిశ్చార్జి అయినా కూడా ఇంటి వద్ద అబ్జర్వేషన్‌లో ఆయన కొనసాగాల్సి ఉందని చెప్పారు. శ్వాస పీల్చుకోవడం, ఇతర సమస్యలతో బుద్ధదేవ్ ఈ నెల 9న ఆసుపత్రిలో చేరిన సంగతి తెలిసిందే. వెంటిలేటర్ ఉంచి ఆయనకు చికిత్స అందించారు.

# రెచ్చిపోతున్న సైబర్ నేరగాళ్లు

### అప్రమత్తంగా ఉండాలని పోలీసులు హెచ్చరిక

హైదరాబాద్,డిసెంబర్15(ఆర్ఎన్ఎ): హైదరాబాద్‌లో సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. రోజురోజుకూ వారి ఆగడాలు శృతిమించుతున్నాయి. ఒకే రోజులో కేటుగాళ్లు రూ.11 లక్షలు కాజేశారు. క్యూఆర్ కోడ్‌తో ఆరుగురి నుంచి రూ.4.5 లక్షలు మోసం చేసినట్లు సమాచారం. ఓ మహిళ ఖాతాలో నుంచి రూ.6 లక్షలు, ఎల్ఐసీ ఏజెంట్ నుంచి రూ.86 వేలను సైబర్ ముఠా మాయం చేసింది. మోసపోయిన బాధితులు సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించారు. అమాయకులే టా÷–గ్గ÷ట్‌గా కేటుగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారని వారి పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని పోలీసులు తెలిపారు. ఈసందర్భంగా పలు సూచనలు సూచించారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# భారీగా గంజాయి పట్టివేత

భద్రాద్రి కొత్తగూడెం,డిసెంబర్15(ఆర్ఎన్ఎ): తెలుగు రాష్ట్రాల్లో భారీగా గంజాయి పట్టుబడింది. భద్రాచలంలో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. రెండు వాహనాలలో తరలిస్తున్న రూ. 2 కోట్ల విలువైన గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు. ప్రకాశం జిల్లా మార్టూరు మండలం బొల్లాపల్లి టోల్ ప్లాజా వద్ద పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో భారీగా గంజాయి పట్టుబడింది. నిందితుల దగ్గరి నుంచి పోలీసులు 400 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ సుమారు రూ.25 లక్షల వరకు ఉంటుందని పోలీసులు తెలిపారు. ఈసరుకును విశాఖ నుంచి చెన్నైకి కారులో అక్రమంగా తరలిస్తున్నట్లు పోలీసులు చెప్పారు. ఈ కేసులో పోలీసులు ఏడుగురు నిందితులను అరెస్ట్ చేసి విచారణ చేపట్టారు.

# నగరానికి మరో 30 అర్బన్ పార్కులు

### -వెల్లడించిన అటవీశాఖ అధికారులు

హైదరాబాద్,డిసెంబర్15(ఆర్ఎన్ఎ): దశల వారీగా మరో ముప్పైనాలుగు అర్బన్ ఫారెస్ట్ పార్కులు గ్రేటర్‌హైదరాబాద్ వాసులకు అందుబాటులోకి రానున్నాయి. వీటి పురోగతిపై సంబంధిత శాఖలు, బాధ్యులైన అధికారులతో అరణ్య భవన్ లో అటవీ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి సమీక్షా సమావేశం నిర్వహించారు. కరోనా వల్ల ఆలస్యం అయిన అర్బన్ ఫారెస్ట్ పార్కులను వెంటనే పూర్తి చేసి వీలైనంత త్వరగా ప్రజలకు అందుబాటులోకి తేవాలని నిర్ణయించారు. హెచ్.ఎం.డీ.ఏ పరిధిలో మొత్తం 59 పార్కులు నిర్మాణంలో ఉన్నాయి. ఇందులో 18 పార్కులు ఇప్పటికే ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి. మరో 34 వివిధ దశల్లో ఉన్నాయి. వీటిని కూడా రానున్న మూడు నెలల్లో పూర్తి చేసి, దశల వారీగా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించారు. ముఖ్యమంత్రి కే.చంద్రశేఖర రావుతో పాటు, అటవీ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి నిత్యం అర్బన్ పార్కుల పురోగతిపై ఆరా తీస్తున్నారని, పనుల్లో మరింత జాప్యం జరగకుండా ఏజెన్సీలతో పనులు పూర్తి చేయాలని శాంతి కుమారి ఆదేశించారు. ప్రతీ పార్కు పనుల పురోగతిని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వీక్షిస్తూ, అవసరమైన సలహాలు సూచనలు ఇచ్చారు.

దేశంలో ఏ నగరంలోనూ లేని విధంగా హైదరాబాద్ చుట్టూ లక్షా యాభై వేల ఎకరాలకు పైగా అటవీ భూమికి పూర్తి రక్షణ కంచె నిర్మిస్తున్నామని, ప్రతీ అటవీ బ్లాక్ లో జనావాసాలకు దగ్గరకు ఉన్న, కొద్ది అటవీ ప్రాంతంలో అర్బన్ పార్కులను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. అటవీ శాఖతో పాటు, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది బాగా పనిచేస్తున్నారని, అందుకే అర్బన్ ఫారెస్ట్ పార్కులు చరిత్రలో నిలిచిపోయేలా తయారవుతున్నాయని శాంతి కుమారి ప్రశంసించారు. ఆయా పార్కుల ప్రత్యేకతలను, పనులు జరుగుతున్న విధానాన్ని అటవీ సంరక్షణ ప్రధాన అధికారి (పీసీసీఎఫ్) ఆర్.శోభ సమావేశంలో వివరించారు. 34 పార్కుల్లో జనవరి నెలాఖరుకు 19, ఫిబ్రవరిలో 05, మార్చి కల్లా 09 పార్కుల్లో పనులు పూర్తి అవుతాయని, (ఇంకొక ఏడు పార్కుల నిర్మాణం వచ్చే ఏడాది చేపడతారు) అన్నిటిని ప్రజలకు అందుబాటులోకి తెస్తామన్నారు. అటవీ భూమి ఎలాంటి ఆక్రమణలకు గురికాకుండా కంచె వేయటంతో పాటు, అన్ని ప్రాంతాల్లో కన్జర్వేషన్ జోన్లను కూడా అభివృద్ధి చేస్తున్నట్లు పీసీసీఎఫ్ వెల్లడించారు. సమావేశంలో పీసీసీఎఫ్ (సోషల్ ఫారెస్ట్రీ) ఆర్.ఎం. డోబ్రియల్, సంబంధిత జిల్లాల అటవీ అధికారులు, హైదరాబాద్ చీఫ్ కన్జర్వేటర్ చంద్రశేఖర రెడ్డి, జీహెచ్ఎంసీ, హెచ్ఎండీయే, మెట్రో రైల్, టీఎస్ఐఐసీ, ఫారెస్ట్ కార్పోరేషన్ అధికారులు పాల్గొన్నారు.

# జియో కస్టమర్లు లక్ష్యంగా మోసం

హైదరాబాద్,డిసెంబర్15(ఆర్ఎన్ఎ): నగరంలో మరో కొత్త తరహా మోసం వెలుగుచూసింది. జియో కస్టమర్లే లక్ష్యంగా ఓ ముఠా దోపిడీకి పాల్పడుతోంది. మీ సిమ్ బ్లాక్ అవుతుందంటూ.. రిచార్జ్ చేయాలంటూ కస్టమర్ కేర్ పేరుతో మెసేజ్ పంపిస్తున్నారు. రిమోట్ యాక్సెస్ యాప్ ద్వారా రిచార్జ్ చేయమంటున్నారు. యాప్ ద్వారా రీచార్జ్ చేయగానే అకౌంట్‌లో డబ్బులను ముఠా మాయం చేస్తోంది. ఇద్దరు మహిళల నుంచి రూ. 2.7 లక్షలు కాజేశారు. హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులకు బాధితులు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొన్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. జియో కస్టమర్లు సైబర్ చీటర్స్ నుంచి అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు.

# రైలుపట్టాలపై గుర్తు తెలియని శవం

నల్లగొండ,డిసెంబర్15(ఆర్ఎన్ఎ): జిల్లాలోని చిట్యాలలో బీఎన్ రెడ్డి ఫంక్షన్ హాల్ వెనుక రైలు పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతుడి వివరాల కోసం ఆరా తీస్తున్నారు. ఇది హత్యా...ఆత్మహత్యా అన్న కోణంలో పోలీసులు విచారణ చేపట్టారు.

# స్టాంప్ వెండర్ల ధర్నా

### వనస్థలిపురంలో ట్రాఫిక్ జామ్

హైదరాబాద్,డిసెంబర్15(ఆర్ఎన్ఎ): పాత పద్ధతిలేనే రిజిస్ట్రేషన్లు చేయాలని వనస్థలిపురం రిజిస్ట్రేషన్ కార్యాలయం ఆవరణలో పనిచేసే స్టాంపు వెండర్లు, దస్తావేజు లేఖరులు, ఇతర సిబ్బంది ప్లకార్డులతో విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై సోమవారం ఆందోళనకు దిగారు. దీంతో కొద్దిసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. పోలీసులు వచ్చి వారికి నచ్చచెప్పడంతో రిజిస్ట్రేషన్ కార్యాలయం ముందు ఆందోళన చేపట్టారు.

# రాజస్థాన్ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఆధిక్యం

జైపూర్,డిసెంబర్15(ఆర్ఎన్ఎ): రాజస్థాన్‌లో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఆధిక్యాన్ని సాధించింది. మొత్తం 50 మున్సిపాలిటీలకు జరిగిన ఎన్నికల్లో 1775 వార్డు కౌన్సిలర్ పదవులకు గానూ అధికార కాంగ్రెస్‌కు 620, బిజెపికి 548, స్వతంత్రులకు 595 స్థానాలు దక్కాయని రాష్ట్ర ఎలక్షన్ కమిషన్ వెల్లడించింది. 12 జిల్లాలకు జరిగిన ఈ మున్సిపల్ ఎన్నికల్లో బహుజన్ సమాజ్ వాదీ పార్టీకి చెందిన ఏడుగురు అభ్యర్థులు, సిపిఐ, సిపిఐఎం అభ్యర్థులు ఇద్దరు చొప్పున, రాష్ట్రీయ లోకతాంత్రిక్ పార్టీ (ఆర్ఎల్‌పి) అభ్యర్థి ఒక్క స్థానంలో గెలుపొందారని ఎన్నికల కమిషన్ ప్రతినిధి తెలిపారు. ఈ ఎన్నికల కోసం 2,622 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయగా, 14.32 లక్షల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తం ఈ ఎన్నికల్లో 7,249 మంది అభ్యర్థులు పోటీ చేశారు. కాగా, మున్సిపల్ చైర్మన్ పదవికి ఈ నెల 14న నోటిఫికేషన్‌ను విడుదల చేయనున్నారు. డిసెంబర్ 20న ఎన్నికలు జరగనున్నాయి. వైస్ చైర్మన్ పోస్టుకు ఈ నెల 21న ఎన్నికలు నిర్వహిస్తారు.

# రైతులకు జగన్ క్షమాపణలు చెప్పాలి: పిసిసి

అమరావతి,డిసెంబర్15(ఆర్ఎన్ఎ): కొత్త వ్యవసాయ బిల్లులకు ఓటేసినందుకు సీఎం జగన్ రైతులకు క్షమాపణ చెప్పాలని పీసీసీ చీఫ్ శైలజానాథ్ డిమాండ్ చేశారు. ఈ నెల 21న మండల కేంద్రాలలో వ్యవసాయ బిల్లులకు వ్యతిరేకంగా ఆందోళనలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. రాజధాని జేఏసీ సభకు శైలజానాథ్ మద్దతు తెలిపారు. గండికోట ముంపు గ్రామాల ప్రజల పట్ల జగన్ ప్రభుత్వం తీరు అమానవీయమని తులసిరెడ్డి అన్నారు. వెలుగొండ నిర్వాసితులకు రూ.12.5 లక్షలు.. గండికోట నిర్వాసితులకు రూ.10లక్షలా? సొంత జిల్లాపై జగన్‌కు ఎందుకింత వివక్ష అని తులసిరెడ్డి ప్రశ్నించారు.

# ఢిల్లీలో మూడు రోజుల పర్యటనలో కెసిఆర్ రైతులకు మద్దతు ఎందుకు తెలపలే: పీసీసీ కార్యదర్శి ఆది శ్రీనివాస్



రాజన్న సిరిసిల్లా, డిసెంబర్ 15 (నేటినిజం ప్రతినిధి):కేంద్ర ప్రభుత్వం రైతు వ్యతిరేక మూడు బిల్లులను రద్దు చేయాలని ఢిల్లీ పురవీధులలో రైతు సంఘాల ఆధ్వర్యంలో గజగజ చలిలో వణుకుతూ ధర్నా చేస్తున్న దీక్షలు చేస్తున్నారు ఢిల్లీ కి రాకుండా రోడ్లను తవ్వి ఇస్తున్న గోడలు కడుతున్న తరుణాన్ని ప్రజలందరూ గమనిస్తున్నారు అని టిపిసిసి కార్యదర్శి ఆది శ్రీనివాస్ అన్నారు ఆయన మాట్లాడుతూ ఈరోజు ఢిల్లీ ప్రభుత్వం రైతులతో జరుగుతున్న చర్చలో ముందుకు సాగాలి పరిస్థితి నడిపిస్తున్న టువంటి మొండి వైఖరిని తీవ్రంగా కాంగ్రెస్ పార్టీ తరఫున ఖండిస్తున్నామని ఆయన అన్నారు రైతులందరూ భారత్ బంద్ కు పిలుపునిచ్చిన తరుణంలో స్వచ్ఛందంగా భారతదేశం ప్రజలందరూ సంపూర్ణంగ బందు చేయడం జరిగిందని ఆయన అన్నారు రైతులకు మద్దతుగా కేంద్ర ప్రభుత్వం దిగిరాక పోవడంతో చాలా విడ్డూరంగా ఉందని అన్నారు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం భారత్ బంద్ కు పిలుపునిచ్చారు వారు కూడా బందులో పాల్గొన్నారు రోడ్లపై నిరసన తెలిపిన తరుణంలో మూడు రోజుల్లో ఢిల్లీ పర్యటనలో ఉన్న కేసీఆర్ ఎందుకు వెళ్లి ఆ రైతులకు సంఘీభావం తెలపలేదని ప్రజలు అందరు గమనించ వలసినదిగా కోరుతున్నాము అని ఆయన అన్నారు ఎక్కడ సన్న రకాలు వేయమని రైతుకు 25 వందల ఇవ్వమని కోరితే ఇవ్వలేని పరిస్థితి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉందని ఆయన అన్నారు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం టిఆర్ఎస్ పార్టీ రైతులకు మద్దతుగా బందు చేసి రైతుల దగ్గర మంచి పేరు తెచ్చుకోవాలని ఒక డ్రామా ఆడారని వారు అన్నారు ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం దిగి రావాలి ఆ మూడు బిల్లును రద్దు చేయాలని ఆయన కోరారు ఢిల్లీ పురవీధుల్లో దీక్షలు ధర్నాలు చేస్తున్న రైతులకు ఈ ప్రాంత తరపున వారికి సంఘీభావం తెలిపారు కేంద్ర ప్రభుత్వం దిగిరాకపోతే రైతు సంఘాలు తీసుకున్న నిర్ణయానికి కాంగ్రెస్ పార్టీ మద్దతు ఉంటుందని ఆయన అన్నారుఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు సాగరం వెంకటస్వామి, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి చంద్రగిరి శ్రీనివాస్ గౌడ్, కనికరపు రాకేష్, సామ గోవర్ధన్, నాగుల రాము గౌడ్, వస్తాదు కృష్ణ గౌడ్, పోతుగంటి వెంకన్న తదితరులు ఉన్నారు

# కానిస్టేబుల్ రాజశేఖర్‌కు "జాతీయ స్థాయి అవార్డు"



రాజన్న సిరిసిల్లా, డిసెంబర్ 15 (నేటినిజం ప్రతినిధి):రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్ లో విధులు నిర్వర్తిస్తూ సమాజ సేవ చేస్తూ కరోనా సమయం లో చేసిన సేవకు గాను కానిస్టేబుల్ గొడిశెల రాజశేఖర్ గౌడ్ కు జాతీయ స్థాయి అవార్డు వరించింది . అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన అభినవ స్వచ్ఛంద సేవాసంస్థ (ఐఎస్ వో 9001 -2005) ద్వారా ×రియల్ హీరో× కరోనా వారియర్స్ జాతీయ అవార్డ్× పత్రం ను ఆన్లైన్ లో పంపినట్టు అభినవ కల్చరల్ సోషల్ స్పోర్ట్స్ ఎడ్యుకేషనల్ ఞ అగ్రికల్చరల్ డెవలప్మెంట్ ఆర్గనైజషన్ వ్యవస్థాపక అధ్యక్షులు సంతోష్ కుమార్ తెలిపారు. ఈ సందర్బంగా వారు యువ ఫౌండేషన్ ద్వారా చేస్తున్న సేవా కార్యక్రమాలను మరియు యువ ఫౌండేషన్ సభ్యులను అభినందిస్తూ ది రియల్ హీరో పేరుతో కరోనా వారియర్స్ జాతీయ స్థాయి అవార్డు కి యువ ఫౌండేషన్ అర్హత కలది అని ఎంపిక చేసినట్టు, ముందు ముందు మరిన్ని సేవా కార్యక్రమాలు చేస్తూ యువతకు ఆదర్శం గా నిలవాలి అని యువ ఫౌండేషన్ సభ్యులను వారు కోరారు . ఈ సందర్బంగా కానిస్టేబుల్ రాజశేఖర్ మాట్లాడుతూ పోలీస్ గా నా కర్తవ్యాన్ని నిర్వర్తిస్తూ సమాజ సేవ చేస్తూ యువత ను సమాజ సేవలో భాగం చేస్తూ వారి భవిష్యత్తు కు తన వంతు సహకారం అందిస్తున్నట్టు మరియు యువ ఫౌండేషన్ సభ్యులు చేస్తున్న సేవను గుర్తించి ఈ అవార్డు ఇవ్వడం హర్షనీయం అని తెలిపారు.




లోకకళ్యాణం కోరుతూ తిరుపతి వేద విశ్వవిద్యాలయంలో ధనప్రద విష్ణు మహాయాగాన్ని నిర్వహించిన వేదపండితులు

# ప్రియురాలి విరహం తట్టుకోలేక ఆత్మహత్య

హైదరాబాద్,డిసెంబర్15(ఆర్ఎన్ఎ): ప్రియురాలి కోసం ప్రియుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన నగరంలో కలకలం రేపుతోంది. వంశీకృష్ణ అనే యువకుడు ప్రేమించిన యువతి కోసం అల్వాల్‌లోని భూదేవినగర్ రైల్వే ట్రాక్ వద్ద రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పూర్తి వివరాల్లోకి వెళ్తే.. వంశీకృష్ణ, యువతి ఫేస్‌బుక్ ద్వారా పరిచయమయ్యారు. ఈ పరిచయం కొద్ది రోజుల్లోనే స్నేహంగా మారింది. వంశీకృష్ణ ఆమెను ప్రేమించడం మొదలుపెట్టాడు. ప్రేమకు గుర్తుగా వంశీకృష్ణ తన ఛాతిపై ప్రియురాలి చిత్రాన్ని ముద్రించుకున్నాడు. ఇదిలా ఉంటే.. ఇటీవల వీరిద్దరి మధ్య విభేదాలు వచ్చి విడిపోయినట్టు తెలుస్తోంది. ఈ ఎడబాటును వంశీకృష్ణ తట్టుకోలేక మనస్థాపానికి గురయ్యాడు. ప్రియురాలు దూరం కావడాన్ని అతను తట్టుకోలేకపోయాడు. వారి మధ్య జరిగిన గొడవ గురించి తన స్నేహితులతో వంశీకృష్ణ చెప్పుకుని బోరున విలపించాడు. ఆదివారం తన స్నేహితులతో గడిపి అనంతరం చిలకలగూడకు వెళ్లాడు. డ్యూటీకి పోతున్నానని ఇంట్లో చెప్పి రైల్వే ట్రాక్ వద్దకు వెళ్లి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆఫీసుకు పోతున్నానని చెప్పి.. రైల్వే ట్రాక్‌పై విగతజీవిగా పడివున్న కొడుకును చూసి తల్లిదండ్రులు బోరున విలపించారు. ఈ ఘటనను చూసిన స్థానికులు కూడా కన్నీరుమున్నీరుగా విలపించారు. కాగా.. వంశీకృష్ణ చిలకలగూడలో నివాసముంటున్నట్లు, యువతి అల్వాల్‌లో ఉంటున్నట్లు పోలీసులు తెలిపారు. యువతి సికింద్రాబాద్‌లోని ఎస్ బ్యాంక్‌లో పనిచేస్తుండగా.. వంశీకృష్ణ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

# అవినీతి రుజువులుంటే నిరూపించు

### కాళేశ్వరం ద్వారా నీళ్లిస్తే ఓర్వలేకపోతున్నారు
### బండి సంజయ్‌పై మండిపడ్డ మంత్రి కొప్పుల

జగిత్యాల,డిసెంబర్15(ఆర్ఎన్ఎ): దమ్ముంటే కాళేశ్వరం లేదా ఇతరత్రా అవినీతిని నిరూపించాలని బండి సంజయ్‌కి మంత్రి కొప్పుల ఈశ్వర్ సవాల్ విసిరారు. కేసీఆర్‌ను జైల్లో పెట్టేముందు కాళేశ్వరం ప్రాజెక్ట్ చూడాలని హితువు పలికారు. కేసీఆర్‌కు ఉన్నది 40 ఎకరాల ఫామ్‌హౌజేనని.. బీజేపీ నాయకులు డ్రామాలను కట్టిపెట్టాలని అన్నారు. 40 ఎకరాల ఫామ్‌హౌజ్ కోసం ఎవరైనా కాళేశ్వరం కడతారా అని ప్రశ్నించారు. ప్రాజెక్ట్ కట్టే దమ్ము లేదు కానీ ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. అవినీతి నిరూపించు.. కోర్టుకు వెళ్లు అని బండి సంజయ్‌కు సవాల్ చేశారు. నీళ్లిచ్చే తెలివి లేదు కానీ ఇస్తే ఓర్వలేకపోతున్నారని ధ్వజమెత్తారు. ఆరోపణలు చేయడం కాదు.. నిరూపించే సత్తా ఉండాలని బండి సంజయ్‌ను మంత్రి కొప్పుల ఈశ్వర్ నిలదీశారు. తెలంగాణలోని పథకాలు దేశంలో ఎక్కడా కనిపించవని.. కానీ మన రాష్ట్రంలో సంక్షేమ పథకాల విలువ ప్రజలకు తెలియడం లేదని మంత్రి కొప్పుల ఈశ్వర్ వ్యాఖ్యానించారు. మంగళవారం కొడిమ్యాల మండలం తీర్మాలపూర్ రైతు వేదిక భవనాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులంతా ఒక్క వేదిక దగ్గర చేరి తమ సమస్యలను చర్చించుకోవచ్చని పేర్కొన్నారు. అసంఘటితంగా ఉన్న రైతులందరినీ ఒకచోట చేర్చేలా సీఎం కేసీఆర్ రైతువేదికల నిర్మాణానికి రూపకల్పన చేశారని తెలిపారు. ఈ వేదికల ద్వారా రైతన్నలను ఏకం చేసి వారిలో చైతన్యం నింపేలా ప్రభుత్వం కృషి చేస్తోందని ఆయన చెప్పారు. టీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి ఎంతగానో కృషి చేస్తోందన్నారు. ప్రతిరంగంలోనూ అద్భుతమైన ప్రగతి సాధిస్తున్నామని చెప్పారు. తెలంగాణను దేశానికే తలమానికంగా తీర్చిదిద్దాలన్నది సీఎం కేసీఆర్ సంకల్పమని కొప్పుల ఈశ్వర్ పేర్కొన్నారు.

# హోటల్‌లోకి దూసుకెళ్లిన కారు

### ఇద్దరికి గాయాలు

హైదరాబాద్,డిసెంబర్15(ఆర్ఎన్ఎ): మలక్ పేట్ డీమార్ట్ ఎదురుగా కారు బీభత్సం సృష్టించింది. 72 ఏళ్ల వృద్ధుడు హోండా సిటీ కారుతో ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ సమీపంలోని ఓ టీ కొట్టులోకి దూసుకెళ్లాడు. ఈ ఘటన మంగళవారం స్థానికంగా కలకలం రేపింది. ఈ ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు కావడంతో స్థానికులు వారిని ఆస్పత్రికి తరలించారు. దీంతో కారు డ్రైవింగ్ చేసిన వృద్ధుడు రిటైర్డ్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పోలీసులు గుర్తించారు. అనంతరం అతడిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు. అతడి డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేయాలని, ఫిట్‌నెస్ చెక్ చేయాలని స్థానికులు కోరారు.

# ఆగివున్న లారీని ఢీకొన్న టూ వీలర్

### కర్నాటకకు చెందిన వ్యక్తి మృతి

హైదరాబాద్,డిసెంబర్15(ఆర్ఎన్ఎ): రంగారెడ్డి జిల్లా జన్వాడ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందగా.. మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. కర్ణాటకకు చెందిన రాజు అనే వ్యక్తి శంకర్‌పల్లి నుంచి జన్వాడకు ద్విచక్ర వాహనంపై మరో వ్యక్తితో కలిసి వెళ్తున్నాడు. ఈ క్రమంలో జన్వాడ వద్ద ఆగి ఉన్న లారీని ఢీకొట్టడంతో రాజు (20) అక్కడికక్కడే మృతి చెందాడు. అతనితో ఉన్న మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. ఉపాధి కోసం యువకులు కర్ణాటక నుంచి జన్వాడకు వచ్చారు. పొట్టకూటి కోసం వచ్చి రోడ్డు ప్రమాదం రూపంలో యువకుడు మృతి చెందడం స్థానికంగా విషాదం నెలకొంది.

# తపాలా బీమా ఏజెంట్లకు 17న ముఖాముఖీలు

హైదరాబాద్, డిసెంబర్ 15:తపాలా శాఖ బీమా, గ్రామీణ తపాలా బీమా ఏజెంట్లను నియమించేందుకు డిసెంబర్ 17న హైదరాబాద్ కవాడిగూడ గాంధీనగర్ లోని సీనియర్ సూరింటెండెంట్ కార్యాలయంలో ముఖాముఖీలు నిర్వహించనున్నట్లు డివిజన్ అధికారి సంతోష్ నేత కైరంకొండ తెలిపారు. పదవ తరగతి విద్యార్హత తో 19-50 ఏళ్ళ లోపు వయస్సు కలిగిన నిరుద్యోగులు, మాజీ సైనికులు, అంగన్‌వాడీ సేవకులు, మహిళా మండలి సభ్యులు, విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగులకు ప్రాధాన్యం ఉంటుందని సంతోష్ తెలిపారు.

# తెలంగాణ రాష్ట్ర నిరుద్యోగ యువతకు అప్పరెల్ ట్రైనింగ్ అండ్ డిజైన్ సెంటర్ (ఎ.టి.డి.సి) ద్వారా ఉపాధి అవకాశాలు

హైదరాబాద్, డిసెంబర్ 15:తెల0గాణ రాష్ట్ర ప్రభుత్వ సహకార0తో అప్పరెల్ ట్రైని0గ్ అ0డ్ డిజైన్ సె0టర్(ఎ.టి.డి.సి) రాష్ట్ర నిరుద్యోగ యువతకు ఓ సువర్ణావకాశాన్ని కల్పిస్తో0ది. అప్పరెల్ ట్రైని0గ్ అ0డ్ డిజైన్ సె0టర్(ఎ.టి.డి.సి) కే0ద్ర చేనేత, జౌళి శాఖ ఆధీన0లోని ఎ.ఇ.పి.సి యొక్క శిక్షణా విభాగం.

గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖలోని దీన్ దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజన కింద ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన విద్యార్థులకు ఉచిత వసతి తో పాటు శిక్షణను అందిచనున్నామని ఎ.టి.డి.సి ఓ ప్రకటన లో తెలిపి0ది. పారిశ్రామిక ఇంజనీర్ ఎగ్జిక్యూటివ్ కోర్సు 6 నెలల వ్యవధి తో హైదరాబాద్ కే0ద్ర0లో అ0దిచనున్నట్లు ఎ.టి.డి.సి తెలిపి0ది .

ఇప్పటి వరకు తెలంగాణ రాష్ట్రం లోని వివిధ జిల్లాలకు చెందిన 100 మంది యువతకు శిక్షణ ఇచ్చినట్లు, రూ. 15,000 నెల జీతం తో బెంగళూరు లోని ప్రముఖ వస్త్ర తయారీ పరిశ్రమలో ఉద్యోగం సాధించినట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. కోవిడ్-లాక్ డౌన్ సమయంలో మార్చి ?ఆగస్టు 2020 కాలానికి చాలా మంది విద్యార్థులు ఎలాంటి ఇబ్బంది లేకుండా జీతాలు అందుకున్నట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు.కొత్త బ్యాచ్ కి సంబంధించిన ప్రవేశాలు డిసెంబర్ 1 వ తేదీ నుంచి ప్రారంభ మైనట్లు, తెల0గాణ లోని అన్ని జిల్లాలకు చె0దిన అర్హులైన విద్యార్థులు/ నిరుద్యోగ యువతకు, ముఖ్య0గా గ్రామీణ ప్రా0తానికి చె0దిన విద్యార్థులకు ఉచిత వసతి తో పాటు శిక్షణను అ0దజేయనున్నట్లు, శిక్షణ అన0తర0 విద్యార్థులకు వస్త్ర పరిశ్రమలో ఉపాధి కల్పి0చనున్నట్లు ఎ.టి.డి.సి తెలిపి0ది.

అర్హతకు స0బ0ధి0చిన నిబ0ధనలు:

విద్య - ఇంటర్మీడియట్ పాస్

వయస్సు- 18-25 సంవత్సరాలు (జనన ధృవీకరణ పత్రము)

ఆదాయం- ఃఖఒ రేషన్ కార్డ్ (వైట్ రేషన్ కార్డ్)

ఆధార్ కార్డ్ - తెలంగాణ (గ్రామీణ ప్రాంతం మాత్రమే)

నివాస / గృహ ధృవీకరణ పత్రము.

ఆసక్తి గల అభ్యర్థులు కి0ద ఇచ్చిన చిరునామాలో స0ప్రది0చవచ్చు:

ఎ.టి.డి.సి, సర్వే నెం. 64, నెక్స్ గలేరియా మాల్, హైటెక్ సిటీ మెట్రో స్టేషన్ దగ్గర, మాదాపూర్, హైటెక్ సిటీ, హైదరాబాద్-81, సంప్రదించవలసిన న0బర్లు: 9611238944, 990850368, 9177041704..

# జీఎస్టీ పరిహారం విడుదల

హైదరాబాద్,డిసెంబర్14(ఆర్ఎన్ఎ): జీఎస్టీ పరిహారం కింద రాష్ట్రాలకు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ మరోసారి రుణాలు విడుదల చేసింది. 7వ విడతగా అన్ని రాష్ట్రాలకు కలిపి రూ. 6వేల కోట్ల రూపాయల రుణాలను విడుదల చేసినట్లు ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటి వరకు అన్ని రాష్ట్రాలకు కలిపి రూ. 42 వేల కోట్ల రుణం ఇచ్చింది కేంద్రం. 7వ విడుత నిధుల్లో తెలంగాణకు రూ. 129 కోట్లు, ఆంధ్రప్రదేశ్‌కు రూ. 125 కోట్లు విడుదల చేసింది. ఇప్పటివరకు విడుదల చేసిన రుణాల్లో ఆంధ్రప్రదేశ్‌కు రూ.1055.79 కోట్లు, తెలంగాణకు రూ. 559.02 కోట్లు విడుదల చేసింది కేంద్రం.

# కర్నాటక శాసన మండలిలో గందరగోళం

### డిప్యూటీ ఛైర్మన్‌ను లాగి పడేసిన కాంగ్రెస్ సభ్యులు
### కాంగ్రెస్ తీరుపై మండిపడ్డ అధికార పక్ష సభ్యులు

బెంగళూరు,డిసెంబర్15(ఆర్ఎన్ఎ): కర్నాటక శాసన మండలిలో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి.. చివరకు ఛైర్మన్ ఛైర్‌కు అవమానం జరిగింది... ఆ ఛైర్‌లో ఉన్న డిప్యూటీ ఛైర్మన్‌ను బలవంతంగా లాగేసి.. బయటకు పంపించారు ప్రతిపక్ష సభ్యులు.. ఈ అనూహ్య పరిణామాలు కర్ణాటక శాసన మండలిలో చోటు చేసుకున్నాయి. సభలోనే బీజేపీ, కాంగ్రెస్ సభ్యులు బాహాబాహికి దిగారు.. వాగ్వివాదం కాస్తా తీవ్ర కావడంతో.. తోపులాట, ఘర్షణ జరిగింది.. ఒక దశలో కాంగ్రెస్ సభ్యులు రెచ్చిపోయారు.. ఛైర్మన్ స్థానంలో ఉన్న డిప్యూటీ ఛైర్మన్‌ను లాగేసి.. బలవంతంగా బయటికి పంపించేశారు. ఛైర్మన్ స్థానం ఎదురుగా ఉన్న అద్దాన్ని పగులగొట్టారు. దీనితో మండలిలో తీవ్ర గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. శీతాకాల సమావేశాల సందర్భంగా మంగళవారం ఈ ఘటన చోటు చేసుకుంది. ఉదయం మండలి ప్రారంభమైన వెంటనే.. డిప్యూటీ ఛైర్మన్ ధర్మేగౌడ సభాపతి స్థానంలో ఆశీనులయ్యారు. సభా కార్యక్రమాలను ఆరంభించారు. ఆయన ఛైర్మన్ స్థానంలో కూర్చోవడం పట్ల కాంగ్రెస్ సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఛైర్మన్ స్థానంలో కూర్చునే హక్కు ధర్మేగౌడకు లేదని కాంగ్రెస్ సభ్యులు మండిపడ్డారు. భారతీయ జనతా పార్టీ, జనతాదళ్ (సెక్యులర్) పార్టీలు అక్రమంగా ఛైర్మన్ స్థానాన్ని దక్కించుకోవడానికి ప్రయత్నిస్తు న్నాయని ఆగ్రహం వ్యక్తం చేశాయి.. తాము శాసన మండలి ఛైర్మన్‌పై అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టామని, దానిపై చర్చించకుండా బీజేపీ-జేడీఎస్ సభ్యులు తమను అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని కాంగ్రెస్ సభ్యులు భగ్గుమన్నారు. తాము గౌరవంగా ధర్మేగౌడను ఛైర్మన్ స్థానం నుంచి దిగిపోవాలని విజ్ఞప్తి చేశారు. దానికి ఆయన అంగీకరించలేదు. దీనితో కాంగ్రెస్ సభ్యులు వాగ్వివాదానికి దిగారు. ఆగ్రహించిన వారంతా పోడియం వైపు దూసుకెళ్లారు. ఆయనతో ఘర్షణ పడ్డారు. అయినప్పటికీ.. ఆయన ఛైర్మన్ స్థానం నుంచి లేవ లేదు. తాను నిబంధనల ప్రకారమే మండలి డిప్యూటీ ఛైర్మన్‌గా ఎన్నికయ్యానని చెప్పారు.. దానికి కాంగ్రెస్ సభ్యులెవరూ వినిపించుకోలేదు. ఛైర్మన్ స్థానంలో కూర్చున్న ధర్మేగౌడను పక్కకు లాగేశారు. రెండు చేతులను పట్టుకుని పైకి లేపారు. బలవంతంగా ఆయనను ఆ స్థానం నుంచి ఖాళీ చేయించారు. ఛైర్మన్ స్థానం వెనుక వైపు ఉన్న మార్గం గుండా ఆయనను బయటికి పంపించేశారు. అనంతరం లోపలి నుంచి గడియ పెట్టేశారు. ఆ సమయంలో కాంగ్రెస్ సభ్యులకు బీజేపీ ఎమ్మెల్సీలు అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగా వారిద్దరి మధ్య తీవ్ర పెనుగులాట చోటు చేసుకుంది. ఒకరినొకరు తోసుకున్నారు. ఘర్షణకు దిగారు. మండలి స్థానాన్ని ఆయన అక్రమంగా ఆక్రమించారని కాంగ్రెస్ సభ్యులు మండిపడ్డారు. ఆయనను బయటికి పంపించే నైతిక హక్కు తమకు ఉందని కాంగ్రెస్ సభ్యుడు ప్రకాష్ రాథోడ్ అన్నారు. అవిశ్వాస తీర్మానంపై చర్చించాల్సి ఉన్న దశలో ఆయన ఎలా ఛైర్మన్ స్థానాన్ని ఆక్రమించుకుంటారని ప్రశ్నించారు. కాంగ్రెస్ వైఖరిని బీజేపీ సభ్యులు తీవ్రంగా తప్పుపట్టారు. ఇలాంటి పరిణామాలను తాము చట్టసభల్లో ఎప్పుడూ చూడలేదని బీజేపీ సభ్యుడు లెహర్ సింగ్ షిరోయా అన్నారు. ఛైర్మన్ స్థానాన్ని కించపరిచిన కాంగ్రెస్ సభ్యులపై అనర్హత వేటు వేయాలని డిమాండ్ చేశారు. ఈ ఘటన అనంతరం శాసన మండలి నిరవధికంగా వాయిదా పడింది.

# రైతులకు అండగా కెసిఆర్ కృషి

### ధర్మారంలో అభివృద్ధి కార్యక్రమాలకు ఎమ్మెల్యే శ్రీకారం

వరంగల్ రూరల్,డిసెంబర్15 (ఆర్ఎన్ఎ): రైతాంగానికి అండగా ఉంటూ వారి అభివృద్ధికి శక్తివంచన లేకుండా ముఖ్యమంత్రి కేసీఆర్ కృషిచేస్తున్నారని పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని 3వ డివిజన్ ధర్మారం గ్రామంలో రూ.1.50 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..కేంద్రం ప్రవేశపెట్టిన వ్యవసాయ చట్టాల కారణంగా దేశానికి అన్నం పెట్టే రైతు రోడ్ల మీద ధర్నా చేయాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. బీజేపీ రాజకీయ పబ్బం గడుపుకోవడానికి అసత్య ప్రచారాలు చేయడమే పనిగా పెట్టుకుందని విమర్శించారు. వాటిని ప్రజలను తిప్పికొట్టాలన్నారు. మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ సహకారంతో మునిసిపాలిటీలోని విలీన గ్రామాల్లో అభివృద్ధి చేసుకుంటున్నామని వివరించారు. ఒక్క 3వ డివిజన్ లోనే రూ.23.00 కోట్లతో అభివృద్ధి పనులు చేశామన్నారు.గత పాలకులు హయాంలో గీసుగొండ మండలంలో ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదు.గిచ్చి గొడవలు పెట్టారే తప్ప ప్రజలను, అభివృద్ధి విస్మరించారన్నారు. ఒక్క ధర్మారం గ్రామంలో దాదాపు రూ.10 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు చేశామని వివరించారు. విలీన గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం ఎన్ని నిధులైన కేటాయించడానికి సిద్ధంగా ఉందన్నారు. అందుకు కావాల్సిన పనుల ప్రతిపాదనలు అధికారు తయారు చేసివ్వాలన్నారు.

# కెసిఆర్ ప్రజావ్యతిరేక విధానాలు వీడాలి

### కొత్త విధానంతో రిజిస్ట్రేషన్లతో తీవ్ర ఇబ్బందులు
### ప్రజలకు గుదిబండలా మారిన ఎల్ఆర్ఎస్ స్కీమ్
### మీడియా సమావేశంలో ఎంపి కోమటిరెడ్డి మండిపాటు

హైదరాబాద్,డిసెంబర్15(ఆర్ఎన్ఎ): ఎల్ఆర్ఎస్ రద్దు చేయాలి.. లేకుంటే ప్రజా ఉద్యమం తప్పదని కాంగ్రెస్ ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. రిజిస్ట్రేషన్లు నిలిపివేసి ప్రజలను ఇబ్బంది పెట్టారని మండిపడ్డారు. కోమటిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ కేసీఆర్ నిర్ణయాలు పిచ్చి తుగ్లకు చర్యలను తలపిస్తున్నాయన్నారు.. కొత్త విధానంతో రిజిస్ట్రేషన్లు ప్రజలకు తీవ్ర ఇబ్బందులు తపపడంలేదని, పాత విధానం ప్రకారమే రిజిస్ట్రేషన్లు చేయాలన్నారు. కేసీఆర్.. ఇకనైనా ప్రజాస్వామ్య బద్ధంగా పాలన కొనసాగించాలని ఎంపీ కోమటిరెడ్డి హితవు పలికారు. తెలంగాణ ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తోందంటూ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఫైర్ అయ్యారు. మూడు నెలల నుండి రిజిస్ట్రేషన్లు నిలిపివేసి ప్రజలను ఇబ్బంది పెట్టారని విమర్శించిన ఆయన.. సీఎం కేసీఆర్ నిర్ణయాలు పిచ్చి తుగ్లక్ చర్యలను తలపిస్తున్నాయంటూ ఎద్దేవా చేశారు.. కొత్త విధానంతో రిజిస్ట్రేషన్ల వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్న కోమటిరెడ్డి.. తక్షణమే పాత విధానం ప్రకారమే చేయాలని డిమాండ్ చేశారు. మరోవైపు.. ఎల్ఆర్ఎస్ స్కీమ్ ప్రజలకు గుదిబండలా మారిందని ఆవేదన వ్యక్తం చేసిన కోమటిరెడ్డి.. తక్షమే ఎల్ఆర్ఎస్‌ను రద్దు చేయాలని.. లేని పక్షంలో ప్రజల పక్షాన పెద్ద ఎత్తున్న ప్రజా ఉద్యమం చేస్తామని హెచ్చరించారు.. ప్రజా ఉద్యమంతో ప్రగతిభవన్ గాడిలను బద్దలు కొడుతామని వార్నింగ్ ఇచ్చిన కాంగ్రెస్ ఎంపీ.. ఇకనైనా ప్రజాస్వామ్య బద్ధంగా పాలన కొనసాగించాలి.. లేకపోతే కేసీఆర్ భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని వ్యాఖ్యానించారు.

# తెలంగాణలో పాలన అంతా అయోమయం

### ఫామ్ హౌస్ నుంచి నయా రాచరిక పాలన
### మండిపడ్డ సిఎల్‌పి నేత భట్టి విక్రమార్క

హైదరాబాద్,డిసెంబర్14(ఆర్ఎన్ఎ): తెలంగాణలో పాలన అంతా అయోమయంగా సాగుతోందని.. ముఖ్యమంత్రి కేసీఆర్ అటు మంత్రులను, ఇటు ప్రజలను కలవకుండా ఫామ్ హౌస్ నుంచి నయా రాచరిక పాలన చేస్తున్నారని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క తీవ్రస్థాయిలో నిప్పులు చెరిగారు. సోమవారం ఆయన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కేసీఆర్ రెండేళ్ల పాలనపై ధ్వజమెత్తారు. రాష్ట్రంలో అధికారులు ఎవరు ఎక్కడ ఉంటారో.. ఎవరికి తెలియని పరిస్థితులు ఉన్నాయని దుయ్యబట్టారు. సెక్రటేరియట్‌లో ఏ శాఖకు ఫోన్ కలవని విచిత్ర పరిస్థితులు నెలకొన్నాయన్నారు. కాళేశ్వరం నుంచి ఇప్పటివరకూ ఒక్క ఎకరాకైనా నీళ్లు పారాయా? అని భట్టి ప్రశ్నించారు. వరదలతో హైదరాబాద్ నగరం మునిగిపోతే కేసీఆర్ ఫామ్ హౌస్‌లో విశ్రాంతి తీసుకున్నారని భట్టి మండిపడ్డారు. ఎన్నికలప్పుడు ఇచ్చిన భృతి హామీకి అతీగతీ లేదని తీవ్రస్థాయిలో విమర్శించారు. అధికారంలోకి వచ్చి రెండేళ్లయినా కనీసం విధివిధానాలను ఖరారు చేయలేదన్నారు. దళితులకు మూడెకరాల భూమి ఇస్తామన్న హామీపై కనీసం ఊసేలేదని విమర్శించారు. ధరణితో తెలంగాణ గందరగోళంలో పడిందని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సీఎం కేసీఆర్ తనకు కావాల్సిన వారికోసం రాష్ట్ర రెవెన్యూ వ్యవస్థను గందరగోళం చేశారని ఆరోపించారు. వ్యవసాయ రంగం అతలాకుతలం అవుతున్నా.. కేసీఆర్ పట్టించుకోవడం లేదన్నారు. రుణమాఫీ చేయకపోవడం రైతులకు మరింత భారంగా మారిందని.. సన్నవడ్లు పండించిన రైతుల బాధలు కేసీఆర్‌కు పట్టవా? అంటూ భట్టి ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రేటర్ ఎన్నికల ముందు ప్రకటించిన వరద సహాయం ప్రకటించిన ప్రభుత్వం.. ఎన్నికల తరువాత ఎందుకు ఇవ్వడం లేదో చెప్పాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు 57 ఏళ్లకే పెన్షన్ అని చెప్పిన కేసీఆర్.. కొత్త పెన్షన్లు ఎందుకు ఇవ్వడం లేదో సమాధానం చెప్పాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల రిటైర్మెంట్ వయసు పెంచుతామని చెప్పిన ప్రభుత్వం.. తరువాత దానిని మర్చిపోయిందన్నారు. ఆన్‌లైన్ తరగతులకు సరైన వసతులు కల్పించకుండా విద్యావ్యవస్థను నిర్వీర్యం చేశారని ఆయన మండిపడ్డారు. కరోనాను ఆరోగ్యశ్రీ లో చేర్చే అంశం పరిశీలిస్తామన్నారు.. ఎంత వరకు పరిశీలనకు వచ్చిందో ఏవరికీ తెలియదన్నారు. రాష్ట్ర కేబినెట్‌లో మంత్రులకు అధికారాలు లేవు. కేటీఆర్, హరీష్ మినహా అంతా డమ్మీలే అని ఆయన వ్యాఖ్యానించారు. కేసీఆర్ పాలనలో సామాన్య ప్రజలను, రైతులను పట్టించుకునే పరిస్థితి లేదని, సూటు బూటు వేసుకున్నవారినే కేసీఆర్ కలుస్తారని ఘాటుగా విమర్శించారు. సమస్యల నుంచి ప్రజల ఆలోచనను మళ్లించేందుకే భావోద్వేగాలను రెచ్చగొడుతున్నారని ఆరోపించారు. బీజేపీ.. భావోద్వేగాలతో రాజకీయం చేస్తోందని ఆయన మండిపడ్డారు.

సీఎల్పీ నేతగా తమ ఎమ్మెల్యేలు పీసీసీ ఎంపికపై కొన్ని అభిప్రాయాలు చెప్పారు. వారి అభిప్రాయాలను ఇంఛార్జ్ మానిక్యం ఠాగూర్ దృష్టికి తీసుకెళ్ళినట్లు ఈ సందర్భంగా భట్టి మీడియాకు చెప్పారు. పీసీసీ ఎంపికపై తన అభిప్రాయాన్ని పార్టీ ఇంఛార్జ్‌కు తెలియజేసానన్నారు. ఈ సందర్భంగానే ఢిల్లీ వెళ్లే అంశంపై నిర్ణయం తీసుకోలేదని ఆయన మీడియాకు వెల్లడించారు. ఒక వేళ వెళ్లే అవకాశం ఉంటే తప్పకుండా మీడియాకు తెలియజేస్తానని భట్టి విక్రమార్క చెప్పారు. సంగమేశ్వరం నుంచి ఏపీ ప్రభుత్వం జలదోపిడి చేస్తుంటే.. కేసీఆర్ ఏం చేస్తున్నారు? అని ప్రశ్నించారు. ధరణితో రాష్ట్రంలో గందరగోళం నెలకొందన్నారు. కేసీఆర్ తన వాళ్ల కోసం రెవెన్యూ వ్యవస్థను ఆగం చేస్తున్నారని విమర్శించారు. సన్న వరి పండించిన రైతుల బాధలు కేసీఆర్‌కు పట్టవా? కేటీఆర్, హరీష్ మినహా మంత్రులంతా డమ్మీలేనని వ్యాఖ్యానించారు. కేటీఆర్ సూటుబూటు వేసుకున్నవారినే కలుస్తారని ఆరోపించారు. బీజేపీ భావోద్వేగాలతో ఓట్ల రాజకీయం చేస్తోంది.. ఇది తాత్కాలికమేనని అభిప్రాయపడ్డారు. పీసీసీ చీఫ్ ఎంపికపై ఎమ్మెల్యేల అభిప్రాయాలను ఇన్‌చార్జ్‌కు వివరించినట్లు భట్టి తెలిపారు

# అన్నదాతల అభివృద్ధికి సీఎం కేసీఆర్ కృషి



వరంగల్ రూరల్, డిసెంబర్ 15: రైతాంగానికి అండగా ఉంటూ వారి అభివృద్ధికి శక్తివంచన లేకుండా ముఖ్యమంత్రి కేసీఆర్ కృషిచేస్తున్నారని పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని 3వ డివిజన్ ధర్మారం గ్రామంలో రూ.1.50 కోట?లతో అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..కేంద్రం ప్రవేశపెట్టిన వ్యవసాయ చట్టాల కారణంగా దేశానికి అన్నం పెట్టే రైతు రోడ్ల మీద ధర్నా చేయాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు.

బీజేపీ రాజకీయ పబ్బం గడుపుకోవడానికి అసత్య ప్రచారాలు చేయడమే పనిగా పెట్టుకుందని విమర్శించారు. వాటిని ప్రజలను తిప్పికొట్టాలన్నారు. మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ సహకారంతో మునిసిపాలిటీలోని విలీన గ్రామాల్లో అభివృద్ధి చేసుకుంటున్నామని వివరించారు. ఒక్క 3వ డివిజన్ లోనే రూ.23.00 కోట్లతో అభివృద్ధి పనులు చేశామన్నారు.

గత పాలకులు హయాంలో గీసుగొండ మండలంలో ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదు.గిచ్చి గొడవలు పెట్టారే తప్ప ప్రజలను, అభివృద్ధి విస్మరించారన్నారు. ఒక్క ధర్మారం గ్రామంలో దాదాపు రూ.10 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు చేశామని వివరించారు. విలీన గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం ఎన్ని నిధులైన కేటాయించడానికి సిద్ధంగా ఉందన్నారు. అందుకు కావాల్సిన పనుల ప్రతిపాదనలు అధికారు తయారు చేసివ్వాలన్నారు.

# ఫారెస్ట్ అధికారులపై రేగా యుద్ధం

### -వారిని గ్రామాల్లోకి రానివ్వద్దని పిలుపు

భద్రాద్రికొత్తగూడెం,డిసెంబర్15(ఆర్ఎన్ఎ): జిల్లాలో ప్రభుత్వ విప్ రేగా మరోసారి ఫారెస్టు అధికారులపై యుద్ధానికి సిద్ధం కావాలని పిలుపు నిచ్చాడు. సోషల్ మీడియా వేదికగా పినపాక ఎంఎల్ఎ , విప్ అయిన రేగా కాంతారావు ఫారెస్టు అధికారులపై ఘాటుగా కామెంట్స్ చేశాడు.

గతంలో రేగా కాంతారావు ఫారెస్టు అధికారులపై తీవ్ర స్థాయిలో దాడి చేశారు. ఇప్పుడు మరోసారి మళ్లీ తన ఫేస్ బుక్ వేదికగా విమర్శలు చేశారు. గ్రామాల్లోకి ఫారెస్టు అదికారులను రానివ్వ వద్దని, వారు వస్తే నిర్బందించాలని తన అనుచరులకు పిలుపు నిచ్చాడు. వారు గ్రామాల్లోకి వస్తే మనం సర్వ నాశనం అవుతామని, మనకు ఇక దిక్కే ఉండదని అన్నాడు. తాను హైదరాబాద్ నుంచి నియోజకవర్గం వచ్చాక కార్యచరణ ప్రణాళిక సిద్ధం చేస్తానని, ఫారెస్టు అధికారులతో యుద్ధానికి సిద్ధం కావాలని పిలుపు నివ్వడం చర్చనీయాంశంగా మారింది.

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas.
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.